జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 175 | హైదరాబాద్, సెప్టెంబరు 06 బుధవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# నీట మునిగిన పలు కాలనీలు..

## తొంగి చూడని జీహెచ్ఎంసీ




హైదరాబాద్: భారీ వర్షం కారణంగా చింతల్‌లోని గణేష్ నగర్, కల్పనాసొసైటీ, శ్రీనివాస్ నగర్ కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. జీడిమెట్ల నుంచి వచ్చే కాలువ నిండి పొంగిపొర్లుతోంది. దీంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాలు నీట మునిగినప్పటికీ జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులు అటు వైపు తొంగి చూడని పరిస్థితి. ఎమర్జెన్సీ నంబర్స్ కాల్ చేస్తుంటే స్పందన కరువైంది. దీంతో స్థానికులే జీహెచ్ఎంసీ సిబ్బందిగా మారి.. సయకచర్యలు చేపట్టారు.

జోరు వాన...

మరోవైపు అధికారులు హై అలెర్ట్ జారీ చేశారు. అటు తెలంగాణ వ్యాప్తంగా కూడా జోరు వాన కురుస్తోంది. ఉపరితల ఆవర్తనంతో ఆదివారం మొదలైన వర్షం తెరిపినివ్వకుండా పడుతూనే ఉంది. సోమవారం ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కుండపోత కురిసింది. మిగిలిన జిల్లాల్లోనూ విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో వాగులు పొంగి, మరి కొన్ని చోట్ల రోడ్లు తెగి రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల పొలాలు నీట మునిగాయి. మంగళ, బుధవారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, హనుమకొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మంచిర్యాల, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో మంగళవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయంటూ యెల్లో అలర్ట్ ఇచ్చింది. అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది.

# తెలంగాణకు భారీ పెట్టుబడులు..

## 700 కోట్లతో నాఫ్‌కో రాక



హైదరాబాద్, తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. అమెరికా టూర్‌ను ముగించుకొని దుబాయ్ పర్యటనను మొదలు పెట్టిన మంత్రి కేటీఆర్.. పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ బిజి బిజీగా గడుపుతున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి భారీ పెట్టబడితో మంత్రి కేటీఆర్ తన దుబాయి పర్యటన ప్రారంభించారు. అగ్నిమాపక సామాగ్రి తయారీలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన యూఏఈ దిగ్గజ సంస్థ నాఫ్‌కో కంపెనీ తెలంగాణ రాష్ట్రంలో రూ.700 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు మంత్రి కేటీఆర్‌తో కంపెనీ సీఈవో ఖాలిద్ అల్ ఖతిబ్ ప్రతినిధి బృందం సమావేశమైంది. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో తమ అగ్నిమాపక సామాగ్రిని తయారు చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.700 కోట్ల భారీ పెట్టుబడిని పెడుతున్నట్లు తెలిపింది. తెలంగాణతోపాటు దేశం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అగ్నిమాపక సామాగ్రి, అగ్నిమాపక సేవల అవసరం భవిష్యత్తులో భారీగా పెరుగుతుందని విశ్వాసం తమకుందని నాఫ్‌కో తెలిపింది. తెలంగాణలో ఏర్పాటు చేయనున్న అగ్నిమాపక సామాగ్రి తయారీ ప్లాంట్ భారతదేశ డిమాండ్‌కు సరిపోతుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఇండియా పేరు ఇక భారత్?!

## కేంద్రం మరో సంచలన నిర్ణయం..



ఢిల్లీ: దేశంలో ఒకేసారి రాష్ట్రాలకు, పార్లమెంటుకు జమిలి ఎన్నికలు జరపాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం దిశగా అడుగులేస్తున్నట్టు తెలుస్తోంది. ఇండియా పేరును ఇక కేవలం ''భారత్' గా మాత్రమే పిలిచేలా పేరు మార్చడానికి యోచిస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి మనదేశాన్ని పరిపాలించిన బ్రిటిషర్లు మనను ఇండియా అని పిలిచారు. ఇండస్ నది (సింధు నది) ఒడ్డున నివసించే ప్రజలం కాబట్టి, ఇండస్ వ్యాలీ సివిలైజేషన్ (సింధు లోయ నాగరికత) విలసిల్లిన దేశం కాబట్టి బ్రిటిషర్లు మనదేశాన్ని తొలిసారి ఇండియాగా పిలిచారు. అయితే పురాణాల ప్రకారం.. భరతుడు అనే రాజు మనదేశాన్ని పరిపాలించాడని .. ఆయన పేరు మీదుగానే భారతదేశం అని పేరు వచ్చిందని పాఠ్యపుస్తకాల్లో ఉంది. అయితే ఇప్పటికే ప్రపంచంలో చాలా దేశాలు మనల్ని ఇండియాగానే గుర్తిస్తున్నాయి. అలాగే భారత జాతీయులను ఇండియన్స్ గానే పిలుస్తున్నాయి. మరోవైపు ఇటీవల 28 ప్రతిపక్ష పార్టీలు కేంద్రంలో బీజేపీని ఓడించడానికి ఇండియా పేరుతో కూటమి కట్టాయి. అప్పట్లోనే ఈ పేరుపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది.

భారత్ అనే దేశానికి ఈ ఇండియా కూటమి వ్యతిరేకమని ధ్వజమెత్తింది. తండ్రీకొడుకులకు కొత్త హెడేక్! ఈ నేపథ్యంలో దేశంలో జమిలి ఎన్నికల కోసం సెప్టెంబర్ నెలలో ప్రత్యేకంగా పార్లమెంటును సమావేశపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాల్లోనే ఇండియా పేరును భారత్ గా మార్చే బిల్లును కూడా ప్రవేశపెడుతోందని అంటున్నారు. దీనిపై తీర్మానం చేసి పార్లమెంటులో పెడతారని చెబుతున్నారు.

## ఇండియా కూటమికి భయపడే భారత్ ప్రతిపాదన : ఎంకే స్టాలిన్



న్యూఢిల్లీ : విపక్షాలు ఇండియా కూటమితో ముందుకు రావడంతోనే జీ20 డిన్నర్‌కు ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ పేరుతో ఆహ్వాన పత్రం పంపారని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి బీజేపీని అధికారం నుంచి సాగనంపుతుందని పేర్కొన్నారు. ఇండియా అనే ఒక్కపదంతోనే బీజేపీ ఉలిక్కిపడుతోందని ఎద్దేవా చేశారు. బీజేపీయేతర శక్తులన్నీ ఫాసిస్ట్ బీజేపీ సర్కార్‌ను మట్టికరిపించేందుకు ఇండియా పేరుతో ఏకం కాగానే కాషాయ పార్టీ ఇండియా పేరును భారత్‌గా మార్చాలని కోరుకుంటోందని స్టాలిన్ ఆరోపించారు. భారత్ రూపురేఖలు మార్చేస్తామని ప్రగల్భాలు పలికిన బీజేపీ తొమ్మిదేండ్ల తర్వాత దేశం పేరు మార్చేస్తోందని దుయ్యబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా బీజేపీని మట్టికరిపిస్తుందని అన్నారు. కాగా ఇండియా పేరు మార్పు వ్యవహారంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ సర్కార్ చరిత్రను తిరగరాస్తోందని ఆరోపిస్తూ ఇప్పటికిప్పుడు ఇండియా పేరు మార్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆమె నిలదీశారు. విపక్ష కూటమి తమ పేరును ఇండియా నుంచి భారత్‌గా మారిస్తే అప్పుడు మోదీ సర్కార్ దేశం పేరును భారతీయ జనతా పార్టీగా మార్చేస్తారా అని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ పేరుతో ఆహ్వానపత్రాలు వెళ్లిన దాఖలాలను తామెన్నడూ చూడలేదని జీ20 డిన్నర్ ఆహ్వానపత్రాలను ప్రస్తావిస్తూ డీఎంకే ఎంపీ కనిమొళి విస్మయం వ్యక్తం చేశారు. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా, ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా అని రాస్తుంటారని ఈసారి ఎందుకు ఇలా జరిగింది..? దీనివెనుక ఉద్దేశం ఏంటి? దదీని వెనుక ఉన్న రాజకీయాలేంటని ఆమె నిలదీశారు.



## నాలాలో గల్లంతైన బాలుడు మృతి..

హైదరాబాద్: నాలాలు మృత్యుకు హారాలుగా మారిపోయాయి. చినుకు పడితే చాలు.. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. ఏది రహదారియో, ఏది నాలాయో తెలియని పరిస్థితి. అడుగుపెడితే.. అధఃపాతాలానికి పడిపోవడం ఖాయం. నిన్న గాంధీనగర్, ఇవాళ ప్రగతినగర్.. నగరంలో మ్యాన్‌హోల్స్ , నాలాలు యమద్వారానికి మార్గాలుగా మారాయి. వర్షం పడితే చాలు..

(మిగతా 5లో..)

## మనస్పర్థలు పక్కన పెట్టి పని చేస్తే గెలుపు మనదే..: మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి : మనస్పర్థలు పక్కన పెట్టి పని చేస్తే గెలుపు మనదే.. జహీరాబాద్ విజయం మనందరి లక్ష్యం కావాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో మంత్రి హరీశ్ రావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, టీఎస్ఐడీసీ తన్వీర్, నర్సోత్తంలతో పాటు అన్ని మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు జహీరాబాద్ నియోజక వర్గానికి ఉందన్నారు. జహీరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలి. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి మాణిక్ రావు విజయానికి కృషి చేయాలి. పార్టీ నిర్ణయం, సీఎం కేసీఆర్ గారి నిర్ణయంలో మార్పు ఉండదు. మూడోసారి కూడా మాణిక్ రావుని గతంలో లాగా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ విజయాల్లో జహీరాబాద్ కూడా భాగస్వామి అవ్వాలని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మనస్పర్థలు పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. ఈ క్రమంలో పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు అవకాశం తప్పకుండా వస్తుంది. రానున్న రోజుల్లో, భవిష్యత్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలకు తగిన అవకాశాలు వస్తాయన్నారు. ప్రతి కార్యకర్తను పార్టీ కాపాడుతుంది, కలసికట్టుగా పనిచేద్దామన్నారు. ఇప్పటికే పార్టీ ముఖ్య నాయకులు, ప్రధాన కార్యకర్తలకు పార్టీ గుర్తింపు ఇచ్చి గౌరవించింది. ఇంకా ఇతర కార్యకర్తలకు పార్టీ అవకాశం ఇస్తుందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

## నిండుకుండలా లోయర్ మానేరు డ్యామ్

### వరద తీవ్రతతో గేట్లు ఎత్తివేసే అవకాశం



తిమ్మాపూర్ సెప్టెంబర్ 5 :గత రెండు రోజుల నుండి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని చెరువులు జలకళను సంతరించుకుని మత్తల్లు పొంగి పోర్లి మోయాతున్న వాగు లో అధిక నీరు ప్రవహిస్తోంది కురుస్తున్న వర్షాలకు కుంటలు చెరువులు మత్తడి పడి మానేరు డ్యాం లోకి వరద నీరు ఉప్పొంగుతుంది. కాకతీయ కెనాల్ నుంచి 3 వేల కృసెక్కులనీరు బయటకు పోతుంది. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేర్ కు 25584వేల క్యూసెక్కుల నీరు గంట గంటకు వరద ఫ్లో పెరుగుతూ వస్తుంది.

## మూసీకి పోటెత్తిన వరద.. ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తివేత



నల్లగొండ : రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. దీంతో ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ప్రాజెక్టు 5 గేట్లను ఒక్కో అడుగు మేర ఎత్తి 3250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. హైదరాబాద్ జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులకు కూడా వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో హిమాయత్ సాగర్ ప్రాజెక్టు 4 గేట్లు, ఉస్మాన్ సాగర్ 2 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దీంతో మూసీకి వరద పోటెత్తింది.

bahujan bazaar బహుజన్ బజార్ bahujan bazaar
www.bahujanbazaar.in




మిత్రులందరికీ జై భీం,

మన పోరాట యోధురాలు ఝుల్‌కరీ భాయీ చరిత్రను వక్రీకరించి ఝాన్సీలక్ష్మి భాయి చరిత్రను మన చేత ప్రచారం చేయించిన విషయం మీకు తెలుసు దీనికి కారణం మన రచయితలను మనం ప్రోత్సహించకపోవడం. అదేవిధంగా మన రచనలు ప్రతి ఊరులో అందుబాటులో లేకపోవడం వల్ల మన బహుజన వాదం వెనుకబడుతున్న విషయం కూడా మన అందరికి తెలుసు

అందువల్ల బహుజన రచనలను అన్నింటిని మీరు ఆర్డరు చేసిన వెంటనే మీకు అందించే విధంగా చేద్దాం. బహుజన రచయితలను ఆర్థికంగా బలోపేతం చేయడం వల్ల మన చరిత్రలను వెలికితీసే విధంగా చేద్దాం. పుస్తకాలను కొనండి, చదవండి, హాస్టల్ పిల్లలకు బహుమానం ఇవ్వండి.

లాభాలు

- అన్ని ప్రాంతాలు తిరుగకుండా ఇంటినుండే కోరుకున్న పుస్తకాన్ని ఇంటివద్దకు తెప్పించుకోవడం సులువవుతుంది. తద్వారా సమయం డబ్బు ఆదా అవుతుంది.
- మనవాళ్ళ బహుజన చరిత్ర తెలుసుకోవడం బహుజనాభివృద్ధికి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో తగిన విధంగా అవగాహనకు అవకాశం ఉంటుంది.
- బహుజనులకు సంబంధించిన రచయితలు ఎవరెవరు ఎక్కడ ఉన్నారు ఏమేమి రచయినలు చేసారో సులభంగా ఒకేచోట తెలుస్తుంది.
- బహుజన రచయితలు ఆర్థికంగా బలపడటం వల్ల పరిశోధనాత్మకత అభివృద్ధి (Research and Development) సాధ్యం అవుతుంది.

ఉచితం: రూ. 1000/- తో సభ్యత్వం తీసుకున్నవారికి సంవత్సర కాలములో పుస్తకాల రవాణా ఖర్చులు ఉచితం.
రూ. 500/-లకు పైన కొనగోలు చేసే పుస్తకాలపై కూడా రవాణా ఖర్చులు ఉచితం.
ప్రతి యొక్క బహుజనుడు కనీసం ఒక పుస్తకాన్ని కొని హాస్టల్ పిల్లలకు ఉచితంగా ఇచ్చి బహుజనాభివృద్ధి తోడ్పడండి.

జై భీం, జై పూలే, జై బహుజన

డాక్టర్ కె. శివ భాగ్యారావు బహుజన IRS-VRS
చైర్మన్, షైన్ గ్రూప్స్

# కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వం కోసమే మహిళ సంఘాలు

**రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ పరిధిలో 4 లక్షల 31 వేల 402 మంది మహిళా సంఘాలు**

**46 లక్షల 21 వేల 272 మంది మహిళా సభ్యులు పనిచేస్తున్నారు**

**రక్షాబంధన్ కానుకగా ఒక వేయి వంద రూపాయలు పెంపు**

**రాష్ట్రంలో 17 వేల 608 మంది గ్రామ సంఘ సహాయకులకు లబ్ధి**

**ప్రభుత్వ విప్, చెన్నూర్ శాసనసభ్యులు బాల్క సుమన్**



మంచిర్యాల బ్యూరో, సెప్టెంబర్ 5, ప్రజాపాలన :పొదుపు సంఘాల ద్వారా మహిళలను సంఘటితం చేస్తూ, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిలో గ్రామ సంఘ సహాయకుల కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ బాల్క సుమన్ అన్నారు. ప్రభుత్వం గ్రామ సంఘ సహాయకుల వేతనం 8 వేల రూపాయలకు పెంచిన సందర్భంగా మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాలోని 468 మంది గ్రామ సంఘ సహాయకులు జిల్లా స్థాయి కృతజ్ఞత సభలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేష్ నేత, బెల్లంపల్లి శాసనసభ్యులు దుర్గం చిన్నయ్యతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావుతో కలిసి హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన కోసం ప్రత్యేకం కృషి చేస్తున్నామని, మహిళలు సంఘటితంగా ఆర్థిక పరమైన నైపుణ్యాభివృద్ధి చెందడంతో పాటు ఆర్థిక స్థిరత్వం ఉండే విధంగా కుటుంబాల సంక్షేమం కోసం ముందుంజలో ఉండేందుకు కృషి చేస్తుందని, ప్రభుత్వానికి, మహిళలకు అనుసంధానం కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పొదుపు సంఘాల్లోని మహిళలను సంఘటితం చేసి వారిని చైతన్య పరుస్తూ సమన్వయకర్తలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న గ్రామ సంఘ సహాయకుల సేవలను గుర్తించి రక్షాబంధన్ కానుకగా వేతనం పెంచడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా సెర్ఫ్ పరిధిలో 4 లక్షల 31 వేల 402 మంది మహిళా సంఘాలు పని చేస్తున్నాయని, ఇందులో 46 లక్షల 21 వేల 272 మంది మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు. మహిళా సంఘాలకు రుణాలు అందించి వారు ఆర్థికంగా ఎదగడంలో గ్రామ సంఘ సహాయకుల పాత్ర కీలకమైందని అన్నారు. గతంలో 6 వేల రూపాయలు చెల్లించే వేతనాన్ని 2021లో ప్రభుత్వం 30 శాతం పెంచడంతో 6 వేల 900 రూపాయలు కాగా రక్షాబంధన్ కానుకగా ఒక వేయి వంద రూపాయలు పెంచడంతో 8 వేల రూపాయలు చెల్లించడంతో రాష్ట్రంలో 17 వేల 608 మంది గ్రామ సంఘ సహాయకులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. యూనిఫాం నిధులతో పాటు ప్రతి 3 నెలలకు అమలవుతున్న రెన్యూవల్ విధానాన్ని ఏడాదికి పెంచి, జీవిత భీమా అందించడంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి డ్రెస్ కోడ్ కొరకు 2 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. నోట్ల రద్దు, కరోనా విపత్కర పరిస్థితులలో ప్రజా సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని, స్వరాష్ట్రంలో హెూంగార్డులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీల వేతనాలు పెంచడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సమ్మక్క-సారలమ్మ మహిళ భవనాలను నిర్మిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమం మహిళల్లోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 468 గ్రామ సంఘ సహాయకుల వేతనం 8 వేల రూపాయలకు పెంచినందున 10 లక్షల రూపాయలు ప్రతి అదనంగా చెల్లించడం జరుగుతుందని, గ్రామ సంఘ సహాయకులు మరింత ఉత్సాహంతో పని చేయాలని తెలిపారు. గ్రామీణ వ్యవస్థలో మహిళలను అన్ని రంగాలలో మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు, ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో గ్రామ సంఘ సహాయకుల పాత్ర ఎనలేనిదని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, జెడ్.పి.టి.సి.లు, గ్రామ సంఘ సహాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం 4 వేల 625 కోట్లు




మంచిర్యాల బ్యూరో, సెప్టెంబర్ 5, ప్రజాపాలన :జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం 4 వేల 625 కోట్ల రూపాయలుగా నిర్ధేశించడం జరిగిందని, బ్యాంకర్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్తో కలిసి బ్యాంకర్లతో రుణాల లక్ష్యసాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా రుణ ప్రణాళిక లక్ష్యం 4 వేల 625 కోట్ల రూపాయలుగా నిర్ధేశించడం జరిగిందని, లక్ష్యాలను సాధించే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. జూన్ వరకు 1 వేయి 234 కోట్ల రూపాయలు రుణాలు అందించడం జరిగిందని, పంట రుణం క్రింద 427 కోట్ల రూపాయలు, వ్యవసాయ రంగానికి 609 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. రైతు రుణమాఫీ పథకం క్రింద జిల్లాలో 94 వేల మంది అర్హులైన లబ్ధిదారులకు 504 కోట్ల రూపాయలు రుణ మాఫీ చేయడం జరిగిందని, ఇప్పటి వరకు దాదాపు 55 వేల మంది రైతులకు రుణ మాఫీ సొమ్ము 294 కోట్ల రూపాయలను వారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు అందించవలసిన రుణమాఫీ లక్ష్యాలను పూర్తి చేసి నూతన రుణాలను అర్హులైన రైతులకు అందించే విధంగా బ్యాంకర్లు కృషి చేయాలని, పంట రుణాల పునఃరుద్ధరణకు వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులు సహకరించాలని తెలిపారు. గృహ నిర్మాణ రుణాల లక్ష్యం 250 కోట్ల రూపాయలు, విద్యా రుణాలు 130 కోట్ల రూపాయలు, పరిశ్రమల రుణాలు 752 కోట్ల రూపాయలు, వివిధ రంగాల రుణాల లక్ష్యం మొత్తం 344 కోట్ల రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. 7 వేల 3 గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు గాను 426 కోట్ల రూపాయలు, ఖరీఫ్ సీజన్లో పంట రుణాల లక్ష్యం 1 వేయి 298 కోట్ల రూపాయలు కాగా 32.95 శాతంతో 427 కోట్ల రూపాయలు సాధించడం జరిగిందని, వ్యవసాయ దీర్ఘకాలిక రుణాల లక్ష్యం 247 కోట్ల రూపాయలకు గాను 123 కోట్ల రూపాయలు సాధించడం జరిగిందని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అందించే రుణ సదుపాయం వార్షిక లక్ష్యం 752 కోట్ల రూపాయాలు కాగా ఇప్పటి వరకు 166 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ముద్ర రుణ సదుపాయం క్రింద 3 వేయి 294 మంది లబ్ధిదారులకు 33.7 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 74 ప్రాజెక్టుల లక్ష్యంకు గాను 63 ప్రాజెక్టులకు రాయితీ రుణాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం రైతులు, వ్యాపారస్తులు, పి.ఎం.ఈ.జి.పి., ఎస్.సి., ఎస్.టి. కార్పొరేషన్లతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పథకాల కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు. వ్యవసాయ సాగుకు సంబంధించి రుణాలు పొందిన రైతులు సకాలంలో తిరిగి చెల్లించి అవసరమైన నూతన రుణాలు పొందేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వరి పంట రుణ పరిమితి ఎకరాకు 42 వేల నుండి 45 వేల రూపాయల, పత్తి పంటకు ఎకరాకు 42 వేల నుండి 45 వేల రూపాయలతో పాటు ఇతర పంటలకు పరిమితి నిర్ధేశించడం జరిగిందని, పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా గేదెలు, ఆవులు ఒక్కొక్క దానికి రుణ పరిమితి 25 వేల నుండి 27 వేల రూపాయల వరకు నిర్ధేశించడం జరిగిందని, గొర్రెల యూనిట్కు 21 వేల నుండి 23 వేల రూపాయలుగా నిర్ధేశించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రుణ ప్రణాళిక లక్ష్యాలను సాధించే విధంగా బ్యాంక్ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, ఆర్.బి.ఐ. ఎ.జి.ఎం. అనిల్ కల్లూరి, నాబార్డు డి.డి. ఎం. అబ్దుల్ రవూఫ్, యు.బి.ఐ. ఆర్.ఎం. అపర్ణరెడ్డి, టి.జి.బి. ఆర్.ఎం. మురళీమోహన్రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా కృషి చేయాలి



మంచిర్యాల బ్యూరో, సెప్టెంబర్ 5, ప్రజాపాలన : జిల్లాలో ఆయిల్పామ్ సాగు విస్తీర్ణం పెంపొందించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్కుమార్తో కలిసి మ్యాట్రిక్స్, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్పామ్ సాగు విస్తీర్ణం పెంపొందించేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. సాధారణ పంటలకు ప్రత్యామ్నాయంగా వాణిజ్య పంటల సాగులో భాగంగా ఆయిల్పామ్ సాగు, కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించాలని, ఈ సంవత్సరం జిల్లాలో 3 వేల 400 ఎకరాలు సాగు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మ్యాట్రిక్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇది రైతులకు ఎంతో లాభదాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు సహజ, తిరుపతి, మ్యాట్రిక్స్, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్స్ ఆధ్వర్యంలో రాబోయే కొత్త రాజకీయ పార్టీకి గుంటూరు నుండి రామిశెట్టి బాలస్వామి



విజయవాడ 5 సెప్టెంబర్ ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి యొక్క ఆశయాలను సాధించడానికి ఏర్పాటు చేయబోయే కొత్త రాజకీయ పార్టీకి రామిశెట్టి బాలస్వామిని గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ప్రెసిడెంట్ గా నియమిస్తూ నేషనల్ చైర్మన్ డా. కె. శివ భాగ్యారావు బహుజన, ఐఆర్ఎస్. విఆర్ఎస్ ఉత్తర్వులు జారీచేశారు మరియు ఈ సందర్భంగా నేషనల్ చైర్మన్ డా. కె. శివ భాగ్యారావు బహుజన రామిశెట్టి బాలస్వామి కి శుభాకాంక్షలు తెలిపారు. స్టీరింగ్ కమిటీ, స్టేట్ కమిటీ, స్టేట్ కన్వీనర్, అబ్జర్వర్స్ , స్టేట్ ట్రెజరర్ మరియు అన్ని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా రామిశెట్టి బాలస్వామి కి అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పార్స్ ఆధ్వర్యంలో రాబోయే కొత్త రాజకీయ పార్టీ కి నంద్యాల నుండి సి.హెచ్.పి. మల్లేశ్వరుడు



విజయవాడ 5 సెప్టెంబర్ ప్రజాపాలన ప్రతినిధి: పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి యొక్క ఆశయాలను సాధించడానికి ఏర్పాటు చేయబోయే కొత్త రాజకీయ పార్టీకి సి.హెచ్.పి. మల్లేశ్వరుడు ని నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ప్రెసిడెంట్ గా నియమిస్తూ నేషనల్ చైర్మన్ డా. కె. శివ భాగ్యారావు బహుజన, ఐఆర్ఎస్. విఆర్ఎస్ ఉత్తర్వులు జారీచేశారు మరియు ఈ సందర్భంగా నేషనల్ చైర్మన్ డా. కె. శివ భాగ్యారావు బహుజన సి.హెచ్.పి. మల్లేశ్వరుడు కి శుభాకాంక్షలు తెలిపారు. స్టీరింగ్ కమిటీ, స్టేట్ కమిటీ, స్టేట్ కన్వీనర్, అబ్జర్వర్స్ , స్టేట్ ట్రెజరర్ మరియు అన్ని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా సి.హెచ్.పి. మల్లేశ్వరుడు కి అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

# భావితరాలను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యం

**ప్రభుత్వ విప్, చెన్నూర్ శాసనసభ్యులు బాల్క సుమన్**




మంచిర్యాల బ్యూరో, సెప్టెంబర్ 5, ప్రజాపాలన :విద్యార్థి వ్యవస్థ నుండి సన్మార్గంలో నడిపిస్తూ మంచి అలవాట్లు చేస్తూ భావితరాలను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యమని ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు బాల్క సుమన్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేష్ నేత, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, చెన్నూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని, దేశ భవిష్యత్తు తరగతి గదులలో ఉపాధ్యాయుల నేతృత్వంలో నిర్మించబడుతుందని, గురువులు మార్గనిర్దేశకత్వంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. పిల్లలకు విద్యార్థి వ్యవస్థలో గురువులు నేర్పిన పాఠాలు చాలా బలంగా ఉంటాయని, తెలంగాణ ప్రభుత్వంలో విద్యారంగం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల 65 పాఠశాలలకు 7 వేల 289 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థలను నాణ్యతా ప్రమాణాలతో బలోపేతం చేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తయారు చేసి విద్యార్థులకు సకల సౌకర్యాలు నడుమ మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. 1000కి పైగా గురుకులాలలో 1 లక్షా 25 వేల మంది విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుందని, విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత ఫలితాలు సాధించేలా వారితో మమేకమై ఫలితాలలో లక్ష్యసాధన దిశగా ప్రోత్సహించాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ పరంగా పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు ఉన్నత స్థాయిలలో నిలిచిన అనేక మంది తరగతి గదులలో ఉపాధ్యాయులు నేర్పించిన పాఠాలే మూలమని, ఉపాధ్యాయులు, పిల్లలు రోజులో ఎక్కువ సమయంలో పాఠశాలలోనే గడుపుతారని అన్నారు. దేశంలోని ఎంతో మంది మేధావులకు ఉపాధ్యాయులే ఆదర్శమని, పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయుల ప్రభావం విద్యార్థులపై ఖచ్చితంగా ఉంటుందని తెలిపారు. అనంతరం క్రమశిక్షణ, సమయపాలన, డ్రాప్ అవుట్ల తగ్గింపు, నైతికత, విద్యార్థుల సంఖ్య పెంపుదల, వినూత్న బోధాన పద్ధతులు అవలంభించడం, హరితహారం కార్యక్రమం నిర్వహణ, ఆధార్ అనుసంధానం లాంటి అంశాలలో ఉత్తమ సేవలు అందించిన 90 మంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 15న జరుగనున్న టెట్ పరీక్షకు సిద్ధంగా ఉండాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్**



మంచిర్యాల బ్యూరో, సెప్టెంబర్ 5, ప్రజాపాలన : జిల్లాలో ఈ నెల 15న జరుగనున్న టెట్ పరీక్ష (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిర్వహణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉ డాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్ లో జిల్లా పంచాయతీ, విద్య, మిషన్ భగీరథ, విద్యుత్, రవాణా, వైద్య-ఆరోగ్యశాఖల అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో టెట్ పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష నిర్వహణ కొరకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీన పేపర్-1 పరీక్ష ఉదయం 9.30 గం॥ల నుండి మధ్యాహ్నం 12 గం॥ల వరకు, పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 2.30 గం॥ల నుండి 5 గం॥ల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 7 వేల 837 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, ఇందు కొరకు 33 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన సిబ్బందిని నియమించడం జరిగిందని, అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉ 0చే విధంగా చర్యలు తీసుకోవాలని, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని, అత్యవసర సేవల నిమిత్తం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని పరీక్ష కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా ఆర్.టి.సి. అధికారులు బస్సులు నడిపించాలని, ఆ దిశగా రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, తరలింపు ప్రక్రియపై పోలీసు శాఖ అధికారులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన డాక్టర్ కోటా రాంబాబు



ఎర్రుపాలెం ఆగస్టు 5 ప్రజాపాలన ప్రతినిధి ఎర్రుపాలెం మండలంలోని పలు మృతుల కుటుంబాలను మంగళవారం సందర్శించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోటా రాంబాబు పెద్ద గోపురం గ్రామంలో మేదర్ కోటమ్మ అనారోగ్యంతో అకాల మరణం చెందగా మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని మనోధైర్యాన్ని కల్పించారు అనంతరం మీనవోలు గ్రామంలో గంధం సంతోషం అనారోగ్యంతో మృతి చెందగా పార్థీదేవానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు సానుభూతిపరులు పాల్గొన్నారు

## తీసుకున్న పంట రుణాలు సకాలంలో చెల్లించాలి..

**కుర్నవల్లి సొసైటీ చైర్మన్ ప్రదీప్ రెడ్డి..**



తల్లాడ, సెప్టెంబర్ 5 (ప్రజా పాలన న్యూస్):రైతులు సహకార సంఘంలో తీసుకున్న పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కుర్నవల్లి సొసైటీ చైర్మన్ ఆయిలూరి ప్రదీప్ రెడ్డి అన్నారు. సోమవారం కుర్నవల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో సభ్యులకు ఇచ్చే రుణాలను తల్లాడ డిసిసిబి బ్యాంకులో సొసైటీ చైర్మన్ ఆయిలూరి ప్రదీప్ రెడ్డి, మేనేజర్ రమ్య రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్లు తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో తిరిగి చెల్లించి సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి అన్నారు.కార్యక్రమంలో డైరెక్టర్లు శీలం చంద్రశేఖర్ రెడ్డి శీలం వెంకటేశ్వర్ రెడ్డి సెక్రటరీ ఒగ్గు నరసింహారెడ్డి నాబార్డ్ కౌన్సిలర్ బాలమురళి పాల్గొన్నారు.

## ఆళ్ళపాడు పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**నేటి విద్యార్థులే రేపటి ఉపాద్యాయులు కావాలి: సర్పంచ్ మర్రి తిరుపతిరావు**




బోనకల్, సెప్టెంబర్ 05 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామంలో కూరకుల వెంకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాద్యయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు లే ఉపాధ్యాయులు గా సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించడం జరిగింది. వారియొక్క అనుభవాలు జ్ఞాపకాలు ఒక అనుభవంగా ఉంటుందని విద్యార్థులు అన్నారు. సర్వేపల్లి రాధాక్రిష్ణ మూర్తి జ్ఞాపకాలు ఒక ఆదర్శవంతగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ అధ్యక్షతన జరిగిన సేల్ఫే గవర్నమెంట్ సభలో సర్పంచ్ మర్రి తిరుపతిరావు ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ గల విద్యర్థు లై మంచి ఆలోచన క్రమశిక్షణ కలిగి ఉండాలని, నేటి నుంచి క్రమ శిక్షణ కు మారు పేరుగా ఉండి ప్రతి విద్యార్థి ఒక సర్వేపల్లి రాధాకృష్ణ కావాలని నేటి విద్యార్థులే రేపటి పౌరులు గా ఎదగాలని 6వ తరగతి నుంచి 10వరకు ఒక చదువుల పునాదిని ఉపాధ్యాయులు ద్వారా నేర్చుకొని ఉన్నత చదువుల కోసం వెళ్లాలని సూచించారు.క్రమ శిక్షణ కు మారు పేరుగా ఉండి ప్రతి విద్యార్థి ఏదోఒక చైతన్యం తో ఉత్తమ విద్యార్థులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి తిరుపతిరావు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, పి ఈ టి మాధవ రావు, ఉపాధ్యాయు నీలు, సుబాని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



మధిర రూరల్ సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానికశ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ లో ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ బి. అంజన బాబు అధ్యక్షతన ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఉపాధ్యాయులు ఏడుకొండల. రామారావు , మందయ్య , ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ వెదురు. వెంకట రెడ్డి , సీనియర్ హిస్టరీ అధ్యాపకులు దొండపాటి. సత్యనారాయణ సీనియర్ గణిత ఉపాధ్యాయులు నారాయణ రావు సన్మానించారు, ఈ సన్మాన కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తనం గురించి విద్యార్థులకు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చెందు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది ఉపాధ్యాయుడు



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి: విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది ఉపాధ్యాయుడని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానొత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఒక్క ఉపాధ్యాయుడు వేలాది మంది విద్యార్థుల జీవితాలలో వెలుగును నింపుతాడని, ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దే గురువులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన 120 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ , చింతా ప్రభాకర్ ల చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమంటో ,శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ నరహరి రెడ్డి, సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, ప్రభు గౌడ్, డిఆర్ఓ నగేష్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ అవార్డు గ్రహీతలు, విద్యాశాఖ అధికారులు,తదితరులు, పాల్గొన్నారు.

## బీజేపీ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి..

**సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు..**



తల్లాడ, సెప్టెంబర్ 5 (ప్రజా పాలన న్యూస్): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు, గోపాలపేట గ్రామ సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రతి ఇంటికి, ప్రతి దుకాణం వద్దకు వెళ్లి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతతత్వాన్ని పెంచి పోషిస్తుందని ఆరోపించారు. బిజెపి విధానాలపై వామపక్షాల ఆధ్వర్యంలో అలుపెరుగని పోరాటాలు చేయడం జరుగుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ నాయకులు పులి వెంకట నరసయ్య, సూదా హనుమంతరావు, కొమ్మిన్ని బాబు, ముచ్చుంతల చెన్నయ్య, తాళ్లూరి రాములు, అమర్లపూడి భవాని, నాగులు, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




లక్షెట్టిపేట్ , సెప్టెంబర్ 05, ప్రజాపాలన : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల లక్షెట్టిపేట నందు మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ ఎం లలిత కుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం లో విద్యార్థినులందరూ కలిసి, ప్రిన్సిపల్ తో పాటుగా, ఉపాధ్యాయినులందరినీ ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల యొక్క బాధ్యత గురుతరమైనదని తల్లిదండ్రుల తరువాత గురువు యొక్క ప్రభావశీలత విద్యార్థులపై ఎక్కువగా ఉంటుందని, భవిష్యత్తులో గొప్ప పౌరులుగా ఎదిగినటువంటి విద్యార్థులు అందరూ తమకు చదువు చెప్పినటువంటి గురువులను మర్చిపోకుండా గౌరవ భావాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కే మహేశ్వర రావు జూనియర్ వైస్ ప్రిన్సిపల్ జి మౌనిక పలువురు ఉపాధ్యాయిని ఉపాద్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బోనాలు ఉత్సవాల్లో నృత్యం చేసిన ఎమ్మెల్యే

నకిరేకల్:నల్గొండ జిల్లా నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో ముత్యాలమ్మ అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అమ్మవారిని దర్శించుకోవడానికి దేవాలయానికి వచ్చారు ఈ క్రమంలో బోనాలతో దేవాలయానికి వచ్చిన మహిళలకు అభివాదం చేస్తూ వారికి స్వాగతం పలికారు ఎమ్మెల్యే. తరువాత గుడి వద్ద పోతరాజు విషయంలో నృత్యం చేస్తున్న కళాకారుల వద్దకు చేరుకొని వారితో సరి సమానంగా ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కొరడాలను తీసుకొని సాంప్రదాయ నృత్యాన్ని చేశారు. బోనాల పండుగ ఉత్సవాల్లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేసిన నృత్యం ప్రత్యేకంగా నిలిచింది ఎమ్మెల్యేతో సహా నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ ఇతర హోదాలో ఉన్న నాయకులు కుడా నృత్యం చేశారు.

## బైకు, బోలేరో ఢీ.. యువకుడు దుర్మరణం

పిలేరు:అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలోని ముడుపుల వేముల పంచాయతీ రాయలవారిపల్లి దగ్గర బోలేరో వాహనంఢీ కొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన చోటుచేసుకుంది.కేవీ పల్లిమండలం మిన్నంరెడ్డి గారిపల్లికి చెందిన గణేష్, పీలేరు నుండి తమగ్రామానికి వెళుతుండగా కలకడ పీలేరు రహదారి రాయల వారిపల్లి దగ్గర ద్విచక్రవాహనాన్ని బోలేరో ఢీ కొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్నపీలేరు పోలీసులు ఘటనాస్థలం చేరుకొని మృతుదేహానికి పీలేరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

## గులాబీ అభ్యర్థులకు ముందస్తు భారం.




వరంగల్, సెప్టెంబర్ 5,:రాజకీయాలంటే ఖర్చు. అది ఆషామాషీ ఖర్చు కాదు. ఊహించనంత ఖర్చు పెట్టుకోవాలి. అదీ ముందుగానే రంగంలోకి దిగితే ఇక చెప్పాల్సిన పని లేదు. ఇప్పుడు బీఆర్ఎస్ తరపున టిక్కెట్లు పొందిన వారి పరిస్థితి అంతే ఉంది. ఓ వైపు టిక్కెట్లు పొందిన ఆనందం ఉంటే మరో వైపు రోజువారీ ఖర్చులు పెరిగిపోవడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాను సీఎం కేసీఆర్ ఆగస్టు 21న ప్రకటించారు. అది కూడా ఒకేసారి 115 మంది పేర్లతో కూడిన లిస్టును వెలువరించారు. ఆ జాబితాలో చోటు దక్కిన వారి ఆనందానిక ? అవధుల్లేవు. సీటు దక్కిన వారు వెనువెంటనే రంగంలోకి దిగి, క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని పార్టీ అధినేత ఆదేశించారు. ఇక మూణ్నెల్లపాటు హైదరాబాద్‌లో ఎవరూ ఉండొద్దు.. నియోజవర్గాలకు వెళ్లండి, జనంతో మమేకం కావాలని ఆదేశిచింది. దీంతో అభ్యర్థులందరూ 'ఎలక్షన్ గ్రౌండ్'కి వెళ్లిపోయారు. కానీ రోజు రోజుకు నేతల్లో ఉత్సాహం తగ్గిపోతోంది. దీనికి కారణం ఖర్చులు . ఎన్నికల కోసం ఇప్పటి నుంచే 'అన్నీ చూసుకోవాలి.. అన్నీ భరించాలి?' అంటే ఖర్చే తడిసిమోపెడవుతుందని ఆవేదన చెందుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల సమయం అంటే పండగే. వారి కోరికలను అభ్యర్థులు తీర్చాల్సిందే. ఏ మాత్రం కటువుగా మాట్లాడినా, వారు 'అడిగిన దానికి నో చెప్పినా?' అలకపాన్పు ఎక్కుతారామోనన్న భయం వెంటాడుతోంది. టిక్కెట్ దక్కిందనే ఆనందం కంటే? ఇప్పటి నుంచి పెట్టాల్సిన ఖర్చు చూస్తేనే నీరసం వస్తోందని నేతలు మథనపడుతున్నారు. జాబితా వచ్చి నెలరోజులు కాకముందే చోటా మోటా నేతలు, కార్యకర్తలను కాపాడుకునేందుకు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తుంటే..ఈనెలతోపాటు అక్టోబరు, నవంబరు నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవటానికే కష్టంగా ఉందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. వరసగా వినాయక చవితి, బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు వస్తున్నాయి. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రతీ ఊరుకి గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పూజలు, ఊరేగింపులు, భజనల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇదే ఇప్పుడు వారిని మరింత కలవరపాటుకు గురి చేస్తోంది. 'ఎన్నికలు అయిపోయేంత వరకూ కార్యకర్తలు, నాయకులను చంటి పాపల్లా చూసుకోవాలి. ఏ ఒక్కరినీ చేజార్చుకోవద్దు. ఇగోలు, ప్రెస్టేజీలన్నింటినీ పక్కన పెట్టండి. అవసరమైతే మీకు వ్యతిరేకంగా ఉన్న వారి కడుపులో తలకాయపెట్టి మరీ బతిమాలుకోండి?' అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్? అభ్యర్థులకు మొదటి నుంచీ చెబుతూ వస్తున్నారు. దీన్ని పాటించడానికి కోట్లు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందన్న ఆవేదనకు గురవుతున్నారు.

జై భీమ్

మీరెంతో మీకంత - మేమెంతో మాకంత

రాష్ట్రాలలో ఉన్న OC వర్గాలు రిజర్వేషన్స్ వలన ఆ వర్గాలకు నష్టం జరుగుతోందని బాధపడుతున్నారు

అందువల్ల

అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే... అంబేడ్కర్ ప్రతిపాదించిన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ కల్పించి అన్ని కులాలను ABCD లుగా విభజించి సమన్యాయం చేయడానికి 75 సం.ల తరువాత మొట్టమొదటి సరిగా AP,TS లో ఉన్న 1,20,000 మంది PARS సభ్యులు మద్దతు ఇస్తున్నారు

మరి మీరు కూడా www.puleambedkarrajyadhikarasamithi.com వెబ్సైట్ ద్వారా మెంబర్ గా చేరి మద్దతు తెలుపగలరా ?

శివ భాగ్యరావు బహుజన్,IRS-vrs
నేషనల్ కన్వీనర్

పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)

జై పూలే జై భీమ్ జై బహుజన్ జై భారత్

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 06, సెప్టెంబరు 2023

# ఉపాధ్యాయులు భావి సమాజ నిర్దేశకులు

ప్రపంచ పరిణామాలను పరిస్థితులకు అన్వయించి భవిష్యత్ కాలానికి అనుగుణమైన నిర్ణయాలకు నాంది పలికించే కర్త ఉపాధ్యాయుడు. పిల్లలకు ప్రాథమికంగా గుణగణాలు, పద్ధతుల లాంటివి తల్లితండ్రుల నుండి లభించినప్పటికీ, యోగ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేది విద్య మాత్రమే. అలాంటి విద్యనందించే 'గురుతర బాధ్యత' ఉపాధ్యాయుడిదే. దేశం అభివృద్ధిపథంలో పయనించేందుకు, శాస్త్రసాంకేతిక రంగాలలో విజయానికి నాణ్యమైన విద్య ఎంత కీలకమైందో, మానవాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కూడా అంతే ప్రధానం.ప్రపంచ బ్యాంకు నిర్దేశంతో అమలులోకి వచ్చిన సరళీకరణ విధానాలతో 'విద్య' స్వభావమే మారిపోయింది. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా, అత్యధిక ఆదాయాన్ని సృష్టించగల, జ్ఞాన సాధనంగా 'చదువులను' చూడడం ప్రారంభమైంది. తరగతి గది వాతావరణం, బోధించే పాఠ్యాంశాలు, స్వేచ్ఛగా బోధించగల పరిస్థితులు మారిపోయాయి. బోధనా పద్ధతులు, కాలవ్యవధి, మూల్యాంకనా విధానం లాంటి వన్నీ విద్యావేత్తల ప్రమేయం తగ్గి ప్రభుత్వాలే ప్రతి అంశాన్ని నిర్దేశించడం మొదలైంది. విద్యార్థులపై ఉపాధ్యాయుల నియంత్రణ ప్రశ్నార్థకమైంది. 'విద్య' మార్కెట్టు సరుకుగా, వినిమయ వస్తువుగా మారిపోయింది. దీనితో ఉపాధ్యాయుని స్థానం పలచబడింది. అత్యధిక మార్కులు సాధించే విధంగా విద్యార్థులను సంసిద్ధుల్ని చేసే యంత్రంగా మిగిలిపోతున్నాడు. ఒకనాడు సమాజం ఉన్నతంగా గౌరవించే ఉపాధ్యాయుడు ఈనాడు చాలీచాలని వేతనాలు, సర్వీసు సమస్యలతోనూ ప్రభుత్వం, తల్లితండ్రుల, సమాజం అండదండలు లేక ఒంటరివాడ్కెనాడు. రెగ్యులర్ ఉపాధ్యాయుల స్థానంలో అప్రెంటిస్, కాంట్రాక్టు, స్పెషల్ టీచర్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం, అవర్లీ బేస్డ్, అతిథి (గెస్ట్) లాంటి పేర్లతో, అరకొర వేతనాలతో ఉపాధ్యాయులుగా నియామకమై భారంగా కాలం వెళ్ళదీస్తున్న పరిస్థితి. 'సమాన పనికి సమాన వేతనం' అంటూ దేశ అత్యున్నత న్యాయ స్థానం చెప్పిన మాటకు విలువే లేకుండా పోయింది. రెగ్యులర్ టీచర్లు సైతం దశాబ్దాలతరబడి పదోన్నతులు లేక, ఖాళీ పోస్టుల మూలంగా సబ్జెక్టు టీచర్లపై పనిభారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇది ఉపాధ్యాయుని సంక్షేమం పట్ల ప్రభుత్వానికున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. "ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైన, ఆకర్షణీయమైన వేతన విధానాన్ని కలిగి ఉన్నప్పుడే విషయ పరిజ్ఞానం, ఉన్నత విద్యార్హతలు కలిగిన అభ్యర్థులను ఆకర్షింపగలుగుతాము" అన్న కొఠారీ మాటలకు భిన్నమైన పరిస్థితులు నేడు ఉన్నాయనేది వాస్తవం. ఆనాడు మందగమనంతో ఉన్న విద్యార్థికి ఉపాధ్యాయుడు అండగా ఉంటూ సాంత్వనను, ఆసక్తిని కలిగించే పరిస్థితులుండేవి. నేడు పోటీ పరీక్షల వలయంలో, ర్యాంకుల పద్మవ్యూహంలో మానసిక ఒత్తిడితో, దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులను చూస్తున్నాం. ఉపాధ్యాయుడు కేంద్రంగాలేని బలమైన కృత్రిమ వ్యవస్థకు పరాకాష్ఠ ఇది."దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య రూపుదిద్దుకుంటుంది" అనే మాటలను మళ్ళీ మళ్ళీ మననం చేసుకునే ఆవశ్యకత నేటి సమాజానికి ఉన్నది. తరగతి గదిలో దేశ భావిరూపురేఖలకు మెరుగులు దిద్దే ఉపాధ్యాయులు శక్తిసంపన్నులని సమాజం, ప్రభుత్వాలు గుర్తించాలి. సమాజాన్ని ప్రభావితం చేసే, పరిస్థితులను సరిచేసే విశిష్ఠమైన పాత్రను పోషించే బాధ్యత కూడా ఉపాధ్యాయునికి ఉన్నది. తరగతి బోధనకే పరిమితం కాకుండా విద్యారంగంలో చోటుచేసుకుంటున్న ఫెడదోరణులను, వాటివల్ల భవిష్యత్తులో కలిగే నష్టాలను విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు వివరించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలి. తమ సంక్షేమం సమాజ సంక్షేమంతోనే ముడిపడి ఉంటుందనే విషయాన్ని విస్మరించక విద్యారంగ వికాసంకోసం జరిగే ఆందోళనా పోరాటాలకు ప్రజలమద్దతును కూడగట్టాలి. బోధనా ప్రక్రియ ద్వారా విద్యార్థుల ఆలోచనల్లో కొత్త తేజస్సును నింపగలిగే ఉపాధ్యాయుడు విద్యార్థుల అభిమానం ద్వారానే సమాజ విశ్వాసాన్ని పొందగలుగుతాడు. నేడు ఏ ప్రభుత్వాలు కూడా 'ఉపాధ్యాయులు ఎలాంటి విద్యావ్యవస్థను ఆశిస్తున్నారు?' అనే అంశాన్ని పట్టించుకోకపోవడం బాధాకరం. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైపోతున్నా ప్రభుత్వ ఉదాసీనత నుండి దానిని కాపాడలేని బలహీనులుగా ఉపాధ్యాయులు మారిపోయారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడాన్ని ప్రశ్నించే, ఆ చ్కెతన్యానికి నాయకత్వం వహించి ఒత్తిడి పెంచే ప్రయత్నాలు ముమ్మరం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని క్రియాశీలక శక్తులు చేసే ప్రయత్నాలను సైతం నిలువరించడానికి పాలక పక్షాలు అవకాశవాదులను చేరదీయడం మూలంగా విద్యారంగాన్ని నిరాశా నిస్పృహలు కమ్మేస్తున్నాయి. జీవితంలో ఏనాడూ తాను ఎదగలేదనే అసంతృప్తి లేని ఉపాధ్యాయులు ఉన్నత స్థానానికి ఎదిగిన విద్యార్థులు తమకు ఎదురైనపుడు వారి ఉన్నతిని తమ గొప్పతనంగా భావించి అనిర్వచనీయమైన ఆనందానికి లోనవుతారు. తమ విద్యార్థుల ద్వారా దేశసౌభాగ్యంలో భాగస్వాములమైనామని సంతృప్తి చెందుతారు. అది ఉపాధ్యాయ వృత్తి ఔన్నత్యం.

# విశ్వనగరంలో వింత కష్టాలు

సోమవారం గాంధీ నగర్ నాలాలో పడి మహిళ గల్లంతు, గత నెల పద్మారావు నగర్ లో డ్రైనేజి కాలువలో పడి చిన్నారి మృతి. అంబర్ పేట రామాంతపూర్ మధ్య , ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు, ఉప్పల్ చౌరస్తా నుంచి మేడిపల్లి వరకు, ఔటర్ రింగ్ రోడ్డు నుండి కొత్తూరు వరకు ప్రధాన రహదారులు ప్రతి రోజు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్ అంతరాయం గత ఐదు సంవత్సరాలుగా పనులు జరుగుతున్నాయి. భారీ వాహనాలకు ఇదే మార్గం తప్ప వేరే గత్యంతరం లేదు. చక్రం ముందుకు కదలదు, గుంతలు ప్రమాద హెచ్చరికలు లేని పనులు, ఇనుప చువ్వలు, రద్దీ సమయంలో వెల్డింగ్ పనులు ఎప్పుడు అంటుకుంటుందో తెలియని వైనం, రహదారులు నరకప్రాయంగా తయారయ్యాయి దీనికి తోడు వర్షం పడిందంటే ఏది నాలనో ఏది మురికి కాలువలో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు వెడల్పు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉప్పల్ చౌరస్తాలో 38 కోట్లు ఖర్చు చేసి ఎనిమిది చోట్ల ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పరచిన ప్రభుత్వం జీబ్రా క్రాస్ కు అడ్డంగా బారికేడ్స్ బిగించారు. పాదచారులకు ఇబ్బంది కలుగుతున్నది అలాగే ట్రాఫిక్ లైట్లు ఎక్కువసేపు ఉంటున్నది. కీలక సమయంలో ఒక్క పోలీసు ఉండరు. ఉప్పల్ బస్ స్టాప్ లో షేర్ ఆటోల ఆగడాలు మితిమీరుతున్నాయి. పబ్లిక్ ట్రాన్స్పోర్టేషన్ పటిష్ట పరచాల్సిన ప్రభుత్వం ఆవైపుగా పట్టించుకున్న పాపాన పోలేదు. పీక్ టైంలో బస్సులు ఉండవు వస్తే ఒకదాని వెంట ఇంకొకటి మీద మీద వస్తుంటాయి. రోడ్డుకు ఇరువైపులా రెండు మూడు అడుగులు గుంతలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. షాపులు కాంప్లెక్స్ ముందు పేవ్మెంట్ తీసేసారు మోకాలి లోతు గుంతలు పడ్డాయి. ఇనుప రాడ్లు వాహన చోదకులకు ఇబ్బందిగా మారాయి. వాహనాల వేగం పది కిలోమీటర్ల లోపే ఉండి అప్రమత్తంగా లేకపోతే గాయాలపాలు కావాల్సిందే. ఔటర్ రింగు రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి. ఉప్పల్ రింగ్ రోడ్డు పనులు మొదలుపెట్టి ఏడు సంవత్సరాలు గడిచినా నలభై శాతం పనులు పూర్తి కాలేదు. బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి కాక అసంపూర్తిగా ఉన్నాయి. మీర్ ఆలం ట్యాంక్ సమీపంలో పిల్లర్లు వేసి రెండు సంవత్సరాలవుతుంది దిష్టి బొమ్మలు లాగా ఉన్నాయి తప్ప బడ్జెట్ కేటాయింపులు లేక పనులు జరగడం లేదు. ఇప్పటికి జరిగిన పనులకు బిల్లులు కాక కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఎక్కడివక్కడ పనులు నిలిచిపోవడంతో స్తబ్దత నెలకొంది. ఇటీవల కాలంలో ప్రతి రోజు రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మొన్న జూ పార్క్ దగ్గర యువకుడు తల పగిలి చనిపోయాడు,



ఇలా ఎందరో అకాల మరణం పొంది కన్నవారికి కంతశోకం పెడుతున్నారు. పోయిన వారిని ఎలాగూ తీసుకురాలేము, ఉన్నవారికైనా కాపాడుదాం అనే ఉద్దేశం అధికారులకు లేదు. ప్రజలు తమ గమ్యానికి వెళ్లాలంటే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతున్నారు. చర్లపల్లి ఆయిల్ కంపెనీల డిపోలు ఉండటంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. గ్యాస్, ఆయిల్ ట్యాంకర్లు మితిమీరిన వేగంతో నాగారం, రాంపల్లి, చర్లపల్లి, నాచారం, మౌలాలీ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉప్పల్ రింగ్ రోడ్డు నుండి లిటిల్ ఫ్లవర్ కాలేజీ వరకు హనుమకొండ, వరంగల్ ప్రాంతాలకు వెళ్లే బస్సులు డిపోలో నిలిపి ఉంచినట్లు ఉంటుంది. మరోవైపు పోలీసులు సీజ్ చేసిన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, అధిక లోడ్, ఎప్పుడుపడితే అప్పుడు వచ్చే వాహనాలను అడ్డుకొని అక్కడే నిలుస్తున్నాయి. అక్కడే బాబా సాహెబ్ అంబెడ్కర్ విగ్రహం ఉండటంతో ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమం నడుస్తూనే ఉంటుంది. దీనికి తోడు మన నాయకుల జన్మదిన వేడుకలు, పండుగలు, పబ్బాలు, జాతరలు తో హబ్సిగూడ నుండి ఎల్బీ నగర్ వరకు అధికారంలో ఉన్నవారు వారి కుటుంబ సభ్యులు, ద్వితీయ శ్రేణి నాయకులు వారి ముఖాలతో ప్లాస్టిక్ ఫ్లెక్సీలతో దర్శనమిస్తుంటుంది. నిండా నిర్లక్ష్యం, దీనికి తోడు ఆర్ అండ్ బి లో సిబ్బంది లేరు, ఉన్న కొద్ది పాటి ఇంజినీర్ల పరిధి ఎక్కువయ్యింది. కనీసం వారానికి ఒక్క రోజైన తనిఖీ చేయాల్సిన అధికారులు రెండు నెలల ఒకసారి రావడం లేదు. ప్రమాదాలు నివారించడానికి హెచ్చరిక బోర్డు ఉండదు, రేడియం స్టిక్కర్ అంటించరు, దగ్గరకు వెళ్ళేంత వరకు తెలియదు రోడ్డు మధ్యలో పెద్ద మట్టి దిబ్బ ఉన్నదని. ప్రమాదం జరిగిన తర్వాత పారితోషికం చెక్కులు ఇవ్వడానికి నగరం నలుమూలల నుండి నాయకులు వస్తారు, ఆ పారితోషికం ఏదో వారి జోబి నుండి ఇస్తున్నట్లు పేపర్ లో వార్తలు. నియోజకవర్గంలో రోడ్ల అధ్వాన్నం పరిస్థితిలో ఉన్నాయన్న స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులకు తెలియదా ? మీ నిర్లక్ష్యం వలన విలువైన ప్రాణాలు బలి అవుతున్నాయి. చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ పొడిగింపు పనులు నత్తనడకన సాగుతుండడంతో చాంద్రాయణగుట్ట–సంతోష్‌నగర్ మధ్య మార్గం గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, చుట్టుపక్కల వాళ్ళు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాంద్రాయణగుట్ట రోడ్డు కొన్నేళ్లుగా రాకపోకలకు అడ్డాగా మారుతోంది. 44వ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ఫ్లైఓవర్ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో వేలాది మంది ప్రయాణికులకు శాపంగా మారింది. జాతీయ రహదారిపై రూ.38 కోట్లతో చేపట్టిన చాంద్రాయణగుట్ట ప్రాజెక్టు పనులు మధ్యలోనే గడువు దాటిపోయింది. చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ చాలా కాలంగా మూతపడటంతో అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటిగా ఉన్న హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. మూడు సంవత్సరాలుగా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయిందని ప్రయాణికులు వాపోయారు. అంబర్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని సులభతరం చేసేందుకు ఆగస్టు 16 నుంచి పనులు పూర్తయ్యే వరకు చే నంబర్ జంక్షన్ నుంచి అంబర్‌పేట్ టి–జంక్షన్ వరకు 400 మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతుంది. వాహనాల రాకపోకలను అవసరాన్ని బట్టి మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సులు భారీ వాహనాలు గోల్నాక మధ్య, జిందా తిలిస్మాత్ మరియు 6 నెం. జంక్షన్ నుండి కూడా అనుమతించబడవు, ద్విచక్ర నాలుగు చక్రాల వాహనాలు అనుమతించారు. ఉప్పల్ నుండి 6 నెంబరు వైపు వచ్చే బస్సులు భారీ వాహనాలు అంబర్‌పేట్ టి–జంక్షన్ వద్ద అలీ కేఫ్, జిందా తిలిస్మాత్ గోల్నాక కొత్త వంతెన మీదుగా మళ్లించబడతాయి. నింబోలియడ్డ తిలక్‌నగర్ నుండి ఉప్పల్ వైపు వెళ్లే సాధారణ ట్రాఫిక్‌ను జిందా తిలిస్మత్, అలీ కేఫ్, అంబర్‌పేట్ టి–జంక్షన్ మీదుగా 6 నంబర్ జంక్షన్ వద్ద మళ్లిస్తారు. చాదర్‌ఘాట్ నుంచి వచ్చే భారీ వాహనాలను నింబోలిఅడ్డ వద్ద టూరిస్ట్ హోటల్ వైపు మళ్లిస్తున్నారు. నాగోల్ మెట్రో నుంచి హబ్సిగూడ వరకు ట్రాఫిక్ అంతరాయం నిత్యం జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఇక కంటోన్మెంట్ ఏరియా తిరుమలగిరి అల్వాల్ నేరేడ్మెట్ బాలానగర్ హైటెక్ సిటీ కొత్తగూడ మదీనాగూడ మియాపూర్ ట్రాఫిక్ జామ్ లేని ప్రాంతమంటూ ఉండదు. మద్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి పర్మిట్ రూములు, బార్ అండ్ రెస్టారెంట్లకు ఇబ్బడి ముబ్బడిగా పర్మిషన్లు ఇచ్చి వచ్చే సంవత్సరానికి ఈ సంవత్సరమే ఎక్సయిజ్ వేలాలు నిర్వహించి గజానికి నలుగురు పోలీసులు పెట్టి బ్రీత్ అనలైజర్ చేతిలో ఉంచి టార్గెట్లు పెడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రించాల్సిన పోలీసులు తాగుబోతులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రచార ఆర్భాటాలకు చూపిస్తున్న శ్రద్ధ, పనులు వేగవంతం కొరకు పెడితే బాగుంటుంది. లేకపోతే ఎట్లుండే ఎట్లయిపోయె అని ఫ్లెక్సీలు కట్టాల్సి వస్తుందని ప్రజలు అనుకుంటున్నారు.

**డా. యం. సురేష్ బాబు**

# వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విస్మరిస్తే ప్రమాదకరం

ప్రాంతీయ అభివృద్ధి అసమానతలు అనేది భారతీయ విధాన రూపకర్తలకు నిరంతర అభివృద్ధి సవాల్. ఇది వివిధ భౌగోళిక ప్రాంతాలలో ఆర్థిక అభివృద్ధి మరియు అసమాన ఆర్థిక సాధనలో వ్యత్యాసాన్ని సూచిస్తుంది. తలసరి ఆదాయం, దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్న జనాభా నిష్పత్తి, పట్టణ జనాభా శాతం, పరిశ్రమల్లో నిమగ్నమైన వ్యవసాయంలో నిమగ్నమైన జనాభా శాతం, వివిధ రాష్ట్రాల మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి సూచికల ద్వారా ఇది ప్రతిబింబిస్తుంది.సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి అవసరం ప్రజాస్వామ్య రాజకీయాలలో, వృద్ధి మరియు శ్రేయస్సు తప్పనిసరిగా ప్రాంతీయ సమతుల్యత ప్రదర్శించాలి. అందువల్ల అటువంటి సమతుల్యతను సాధించడానికి ప్రయత్నిస్తున్న ప్రజాస్వామ్య ప్రభుత్వం అక్షింతలు. భారతదేశం 29 రాష్ట్రాలుగా విభజించబడింది, వాటి ఉత్పాదక సామర్థ్యం మరియు వారు మద్దతు ఇవ్వగల పరిశ్రమ రకం పరంగా విభిన్నంగా ఉంటుంది. వారి సామర్థ్యాన్ని గ్రహించడం మొత్తం దేశం యొక్క పోటీతత్వాన్ని పెంచడానికి కీలకమైనది. అభివృద్ధిలో ప్రాంతీయ అసమానత హింసాత్మక సంఘర్షణలు, ప్రణాళిక లేని మరియు ప్రమాదకర వలసలు వంటి సవాళ్లకు కారణమవుతుంది . భారతదేశం సమగ్ర ప్రాంతీయ సామర్థ్యంతో అభివృద్ధి చెందితే తప్ప వృద్ధి రేటు యొక్క స్థిరత్వం, దాని అభివృద్ధి లక్ష్యాన్ని సాధించే దేశం యొక్క లక్ష్యం చేరుకోవడం కష్టం. రాష్ట్ర విభజన చట్టంలోని రెండు క్లాజులు ఒకటి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో లభించే వెసులుబాటుతో రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర వెనుకబాటు అధికమించి సమతుల అభివృద్ధి సాధించడానికి అవకాశం కల్పించాయి. పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇటువంటి వెసులుబాటు ఉండింది. పునర్వ్యవస్థీకరణ చట్టం 94(1) ప్రకారం రెండు రాష్ట్రాల్లోనూ పరిశ్రమలు స్థాపించడానికి ఆర్థికాభివృద్ధి సాధించడానికి పన్ను మినహాయింపు తో సహా తగిన ఆర్థిక చర్యలు కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. 94(2) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం భౌతిక, సాంఘిక మౌలిక సదుపాయాల కల్పన తో సహా అవసరమైన ఇతర కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. ఈ రెండు క్లాజులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కారు. ఆంధ్ర రాష్ట్రంలో వెన్నెముక లేని పాలక ప్రతిపక్షాలు కేంద్రాన్ని నిలదీయడంతో పూర్తిగా విఫలమైంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి దిశగా కార్యాచరణ లేకపోవడం దురదృష్టకరం దేశంలో అత్యంత వెనుకబాటుకు, నిర్లక్ష్యానికి గురైన జిల్లాల అభివృద్ధి గురించి ప్రస్తావించకపోవడం చారిత్రక తప్పిదం. వెనుకబడిన ప్రాంతాల సమతుల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళిక లేదు. వెనుకబాటుతనానికి మూల కారణాలు శాస్త్రీయంగా మరియు సామాజిక సంస్థలతో విశ్లేషణ జరగలేదు. గ్రామీణ అభివృద్ధి, పనికి ఆహార పథకం, స్థానిక సంస్థల నిర్వహణ, పంచాయతీ రాజ్ వ్యవస్థలన్నీ తుంగలో తొక్కి నిధులు విడుదల చేయకుండా వ్యవస్థలన్నీ సహజ మరణానికి దారి తీసినట్లు చేస్తున్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న చంద్రబాబు రాజధాని పట్టిసీమ పై ఉత్సహం చూపిస్తే, నాలుగు సంవత్సరాలుగా అధికార వికేంద్రీకరణ, అపాత్ర దానాలకు అత్యుత్సాహం చూపుతున్న ప్రభుత్వం కొంతమేరకైనా వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి పై చూపకపోవడం అభద్రత భావాన్ని, అనుమానాలను, ఈ ప్రాంత ప్రజలలో ఆవేశాలను తీవ్ర నిరాశ నిస్పృహలను రేకెత్తిస్తున్నాయి. పట్టిసీమ నిర్మిస్తే రాయలసీమ సస్యశామలమవుతుందనే విధంగా గత ప్రభుత్వం తీరు ఉండడం సాధారణ ప్రజలకు విస్మయాన్ని కల్గించింది. ప్రాంతాల అభివృద్ధి గురించి తగినంతగా ఏకరువు పెట్టకపోవడం రాయలసీమ ప్రజలను భాదిస్తున్నది. పాలనావసరాలకు రాజధానితో పాటు విద్య, వైద్య, న్యాయ, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, ఎకాలజి, పర్యావరణం, సేవ సంస్థలు, స్మార్ట్ సిటీలు అన్ని రంగాల అభివృద్ధి కలగా మారింది. రాయలసీమలో సాగునీరు, వ్యవసాయం, పశు పోషణ, పాడి అభివృద్ధి, పరిశ్రమలు, పర్యాటకం, మొదలైన రంగాలలో సమతుల అభివృద్ధి జరిగి ఉంటే తెలంగాణ విడిపోయిన మనము ఇప్పుడు ఈ దుస్థితి లో ఉండేవాళ్ళం కాదు. శ్రీబాగ్ ఒడంబడిక ఉల్లంఘనతో పాటు సాగు నీటి విషయంలో ప్రాంతీయ అసమానతలు తొలగించే అనేక విషయాలలో నిర్లక్ష్యానికి గురై అనేక విధాలుగా మోసపోతున్నామనే భావన బలంగా ఉంది. ఇప్పుడున్న ప్రభుత్వ విధానాలు, ప్రయత్నాలు రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం భావనను తొలగించే బదులుగా ఇంకా బలపర్చేవిగా ఉంటున్నాయి. పౌరసమాజం నుండి రాజకీయ పార్టీలలోనూ అంతర్గతంగా ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కావాలనే వారు పెరుగుతున్నారు. కవులు, కళాకారులు, సామాజిక ఉద్యమకారులు, పౌర ప్రజాసంఘాలు నుంచి చివరకు సాధారణ ప్రజలలో ఇలాంటి భావన బలపడే పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించకపోతే భావోద్వేగాలు పెరిగి, సంక్లిష్టత పెరిగి పరిస్థితి మరింత జటిలం కావడం ఖాయం. రాయలసీమ ఏర్పడితే కొంతమేరకు ఆవేశాలు చల్లార వచ్చు కానీ నీటి వనరులు, విద్యుత్, సంస్థలు, అప్పులు, ఉమ్మడి ఆస్తుల పంపకాలు నిర్వహణలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు, ప్రజల మధ్య విద్వేషాలు, కొట్లాటలు నిత్యకృత్యంగా చోటు చేసుకునే పరిస్థితులు ఏర్పడవచ్చు. పెద్ద దేశాలు ఆర్థిక సమాఖ్యలుగా కలసిపోయి, వనరులను జోడించుకొని ఖర్చులు తగ్గించుకొని ప్రపంచ పోటీకి తట్టుకోవాలని తీవ్రంగా ఆలోచన చేస్తున్న సందర్భంలో అనాగరికంగా తిరోగిమంచడం ఏ మాత్రం సమంజసం కాదు. వెనుకబడిన ప్రాంతాలలో అన్ని రంగాలపై లోతుగా అధ్యయనం చేసి మూలలను గుర్తించి జిల్లాలకు సమన్యాయం, సమతుల అభివృద్ధి సాధించడానికి నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేయాలి. ప్రతి జిల్లాలోనూ బహుళ రంగ సమతుల అభివృద్ధి ప్రణాళిక బోర్డు ని ఏర్పాటు చేయాలి. మేధావులు నిపుణుల సలహాలు సూచనలతో ప్రజల భాగస్వామ్యంతో అధికారుల స్థూల ఆమోదంతో ప్రణాళికలు రూపొందించాలి. ప్రాధాన్యతతో కూడిన ప్రణాళికలకు వనరులు కేటాయించినప్పుడే శాశ్విత సమగ్ర అభివృద్ధి సాధ్యం. వనరులను కేటాయించమని అడగడం, ప్రణాళికలను అమలు చేయమని అడగడం సాధించడం జరిగినప్పుడే అభివృద్ధి దిశగా ముందుకు పోవడం జరుగుతుంది. మోసపూరిత వాగ్దానాలు, ఉత్తర ప్రగల్భాలు, ప్రత్యేక హోదా గురించి అలాగే వెనుకబడిన ప్రాంతాల గురించి విస్మరించిన పార్టీలను పక్కన పెట్టక తప్పదు.

## బోనకల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సీఐ వసంత కుమార్



బోనకల్ సెప్టెంబర్ 05 ప్రజా పాలన ప్రతినిధి: బోనకల్ పోలీస్ స్టేషన్ను మంగళవారం మధిర సీఐ వసంత్ కుమార్ సందర్శించారు. త్వరలో రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల నాయకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ వసంత్ కుమార్ మాట్లాడుతూ మండలంలో నాయకులు అధికారులతో సమన్వయంగా ఉండాలని, అధికారులను ఎవరు ఇబ్బంది పెట్టే విధంగా ఉండరాదని, సోషల్ మీడియా గ్రూపుల్లో అనవసరమైన పోస్టులు పెట్టి రాజకీయ విద్వేషాలకు, గొడవలకు లోనవ్వకుండా ఉండాలని, నాయకులు అధికారులతో సజావుగా ఎన్నికల ప్రక్రియ కొనసాగించే విధంగా సహకరించాలని, ఇతర సమస్యలపై పోలీసు వారికే సహకరించాలని, ఎవరైనా అధికారుల విధులకు ఆటంకం కలిగించిన చో ఎంతటి వారి పైన అయినా చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బోల్లేద్దు సాయికుమార్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, బిఆర్ఎస్ మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు,బిజెపి మండల అధ్యక్షులు వీరపనేని అప్పారావు, గోవిందాపురం ఎల్ సహకార సంఘం అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, కలకోట సహకార సంఘం అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి బానోత్ కొండ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మారుపల్లి ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు భూక్యా భద్రు నాయక్, బిఆర్ఎస్ నాయకులు కాకాని శ్రీనివాసరావు, బిజెపి నాయకులు తాళ్లూరి సురేష్, రవి, సిపిఎం నాయకులు కిలారి సురేష్, బంధం శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు జక్కా నాగభూషణం, తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్లను ప్రసన్నం చేసుకొనే పార్టీలు



అదిలాబాద్, సెప్టెంబర్ 5, :రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల వేడి మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో నియోజక వర్గాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటి నుండే నేతలు రెడీ అవుతున్నారు. అధికార పార్టీ సీట్ల ప్రకటన తర్వాత జోష్ మరింత పెరగడంతో ప్రతిపక్ష నేతలు వేగం పెంచారు. టికెట్ పక్కగా మాకే అనుకుంటూ ధీమాతో కొందరు.. ఒక వేళ టికెట్ రాకుంటే పక్క పార్టీలోకి జంప్ అయి పోటీ చేయాలని కొందరు.. ఏదైతే అదైతది ఒంటరిగానే బరిలోకి దిగాల్సిందే అని స్వతంత్ర్య అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ఇంకొందరు ఇప్పటి నుంచి రంగం సిద్దం చేసుకుంటున్నారు. టార్గెట్ 100 నినాదంతో ముచ్చటగా మూడు నెలల్లో నియోజక వర్గం మొత్తం చుట్టేసి ఓటర్ల నాడి పట్టేసి.. తాయిలాలతో ఓటర్లను సంతోషం లో ముంచెత్తి అప్పన్నంగా ఓట్ల వర ద పారించుకోవాలని ఫిక్స్ అవుతు న్నారు. అలాంటి సీన్ ఉమ్మడి ఆది లాబాద్ లోని కొన్ని నియోజక వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ముచ్చటగా మూడోసారి గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని కొందరు నేతలు భారీ ఆశలు పెట్టుకుంటుంటే.. తొలిసారే భారీ విజయాన్ని అందుకోవాలని కొత్త నేతలు మరింత తహతహలాడుతు న్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ లోని ఆదిలాబాద్, నిర్మల్ , ఆసిపాబాద్ నియోజకవర్గాల్లో అప్పుడే ప్రలోభాల పర్వం మొదలైంది. ఇంకా ఎన్నికల నగారా మోగనేలేదు అప్పుడే ఎన్నిక ల సమయం ముంచుకొచ్చిందా అన్న రేంజ్ లో తాయిలాల జాతర సాగుతోంది. ఓటర్లను ఇప్పటి నుండే మచ్చిక చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలే కొనసాగిస్తున్నారు నేతలు. నిర్మల్ లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గొడుగుల పంపిణితో దూసుకుపోతుంటే.. ఆదిలాబాద్ లో కాంగ్రెస్ నుండి టికెట్ దక్కుతుందని భారీ ఆశలు పెట్టుకున్న ఎన్ఆర్ఐ నేత కంది శ్రీనివాస్ రెడ్డి.. మూడు నెలల ముందు నుండే తాయిలాల వర్షం కురిపిస్తున్నారు. ఓటర్లను తన వైపు తిప్పుకునేందుకు పెళ్లిలు, శుభకార్యాల్లో పాల్గొంటూ సొంత ట్రస్ట్ పేరిట బహుమతులు అందజేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు చీర సారెలతో బహుమానాల వర్షం కురిపించిన ఎన్ఆర్ఐ బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి జంప్ అవగానే కొత్త రకం తాయిలాతో ముందుకొచ్చారు. తాజాగా కుక్కర్ల తాయిలాలతో గడప గడపకు గిఫ్ట్ లు చేరవేస్తూ అప్పుడే ప్రచార పర్వాన్ని మొదలెట్టాశారు కంది. కాంగ్రెస్ నుండి టికెట్ రేసులో ఉన్న ఈ యువ ఎన్ఆర్ఐ నేత ఈ మధ్య బీసీ ఐక్య సభలో రగడకు కారణం అవడంతో సీనియర్లంతా ఈయనపై గుర్రుగా ఉండటం.. టికెట్ కందికి ఇవ్వొద్దంటూ అదిష్టానానికి మొరపెట్టుకోవడంతో.. పార్టీ టికెట్ రాకపోయినా స్వతంత్ర్య అభ్యర్థిగా అయినా బరిలో నిలిచేలా పక్కా వ్యూహాలతో దూసుకెళ్లేందుకే ఈ తాయిలాలన్న టాక్ కూడా పొలిటికల్ సర్కిల్లో గట్టిగానే వినిపిస్తోంది. ఎస్టీ నియోజక వర్గాల్లో సైతం తాయిలాల జాతర కొనసాగుతుందన్న ప్రచారం సాగుతోంది. ఖానాపూర్ , బోథ్ , ఆసిపాబాద్ లోను కొత్త నేతలు తమ తమ భవిష్యత్ ను పరిక్షించుకునేందుకు ఇప్పటి నుండే తాయిలాలు అందిస్తున్నారంట. ముధోల్ నియోజక వర్గంలో అయితే అదికార పార్టీకి చెందిన ఓ నేత సైతం ఇదే దారిని ఎంచుకోవాలని ఫిక్స్ అయినట్టు సమాచారం. అదిష్టానం దృష్టిలో పడితే చివరి నిమిషంలో అయినా లాభం చేకూరుతుందనే ఆశతో ప్రజలను ఇప్పటి నుండి తాయిలాల వర్షంలో ముంచెత్తుతున్నారంట. ఇక బెల్లంపల్లి నియోజక వర్గంలోనూ ఓ నేత కుట్టుమెషిన్లు, గోడ గడియారాలు, కుక్కర్లు తెప్పించి జిల్లాలోని సమిప గోదాంలో నిల్వ చేసినట్టు జోరుగా ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ పార్టీల్లో హడావుడి మొదలవడం.. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న కృతనిశ్చయం తోనే ఇలా తాయిలాల జాతరకు తెరలేపుతున్నట్టు ప్రచారం సాగు తోంది. నిజమేనంటూ కొందరు నేతలు బహిరంగంగానే ప్రజలకు తాయిలాలు ఇవ్వడం సాగుతోంది. చూడాలి మరీ ఆలూ లేదు సూలు లేదు అప్పుడే తాయిలాలంటే ప్రజలు ఆయా నేతలకు ఓట్ల వర్షం కురిపిస్తారా.. లేక ఇప్పుడే ఇన్ని ఇస్తున్నారు.. ఎన్నికల సమయంలో ఇంకా దండిగానే ఇస్తారని ఆశపడి ఆయా నేతలను నిండా ముంచుతారా చూడాలి.

# కోమటిరెడ్డి మళ్లీ పక్కచూపులు



నల్గోండ, సెప్టెంబర్ 5, :కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ లోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆ వ్యాఖ్యలు ఈ ప్రచారాన్ని బలపరుస్తున్నాయి. 14 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా పదవులు అనుభవించిన బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి తనకు లీరాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పై ప్రేమ చావడం లేదా? గడిచిన కొద్ది రోజులుగా రాజగోపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరతారన్న ప్రచారంలో ఎంతో కొంత నిజం ఉందా? నిజంగానే ఇంకా ఆయన మనిషక్కడ ఉన్నా.. మనసంతా గాంధీ భవన్ చుట్టే పరిభ్రమిస్తోందా? రాజగోపాల్ రెడ్డి అభిప్రాయాలు, ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. అంటే రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారన్న మాటలను కొట్టిపారేయలేమంటున్నారు విశ్లేషకులు. కాంట్రాక్టర్ అయిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2009 ఎన్నికల సమయంలోనే రాజకీయ అరంగేట్రం చేశారు. తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అప్పటికే వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలోనే రాజగోపాల్ రెడ్డి భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గం వేదికగా రాజకీయాల్లో అడుగుపెట్టారు. కొన్నాళ్లకే వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణంతో రాష్ట్రంలో రాజకీయం పూర్తిగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. ఆ సమయంలో కాంగ్రెస్ ఎంపీగా ఉన్న రాజగోపాల్ రెడ్డి సహా కాంగ్రెస్ ఎంపీలంతా ఈ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన 2014 పార్లమెంటు ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డి తిరిగి భువనగిరి నుంచే కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కానీ కొన్నాళ్లకే జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 2018 శాసనసభ ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ టికెట్ పై ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత పదవి కోసం కూడా లాబీయింగ్ చేసినా.. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రాజగోపాల్ రెడ్డి అభ్యర్థనను పక్కన పెట్టి భట్టి విక్రమార్కను ఆ పదవికి ఎంపిక చేశారు. ఇక, తాను ఖాళీ చేసిన ఎమ్మెల్సీ స్థానం నుంచి తన భార్య కోమటిరెడ్డి లక్ష్మిని పోటీకి పెట్టి చేతులు కాల్చుకున్నారు రాజగోపాల్ రెడ్డి. టీపీసీసీ చీఫ్ గా ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పదవీకాలం ముగియడంతో పీసీసీ అధ్యక్ష పదవి కోసం రాజగోపాల్ రెడ్డి ప్రయత్నించి విఫలమయ్యారు. రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఎంపికైన నాటి నుంచి పార్టీకి అంటీముట్టనట్లు వ్యవహరించారు రాజగోపాల్ రెడ్డి. మరో వైపు తన నియోజవకర్గంలో ఎలాంటి డెవలప్ మెంట్ పనులు చేయలేకపోతున్నాని, సీఎం కేసీఆర్ మీద కారాలు మిరియాలు నూరి, బీజేపీకి దగ్గరయ్యారు. కాంగ్రెస్ నాయకత్వ తప్పులను ఎత్తి చూపుతూ సీఎం కేసీఆర్ ను కంట్రోల్ చేయగలిగేది కేంద్రంలో ఉన్న బీజేపీ ఒక్కటే అని కాంగ్రెస్ కు రాజీనామా చేసి, బీజేపీ కండువా కప్పుకున్నారు. మునుగోడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఉప ఎన్నికకు కారణమయ్యారు. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటికి దిగి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన బీజేపీ కార్యక్రమాలకూ దాదాపుగా దూరంగానే ఉంటున్నారు. పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో బీజేపీ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ కు అప్పజెప్పాల్సి వచ్చింది. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తెలంగాణ కాంగ్రెస్ లో జోష్ నింపింది. తెలంగాణలో బీజేపీ ఇక పుంజుకోలేదేమోనన్న అభిప్రాయం బలపడిన నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారతారని, బీజేపీని వీడి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుతారని ప్రచారం ఊపందుకుంది. ఈలోగా రాష్ట్ర బీజేపీ సారథి కూడా మారి బండి సంజయ్ స్థానంలో కేంద్ర మంత్రిగా ఉన్న జి.కిషన్ రెడ్డి రావడం చకచకా జరిగిపోయిన పరిణామాలు. పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందన్న అభిప్రాయంలో ఉన్న కోమటిరెడ్డికి బీజేపీ జాతీయ కార్యవర్గంలో స్థానం కల్పించినా ఆయన పెద్దగా కార్యక్రమాల్లో పాల్గొనలేదు. కానీ రెండు రోజుల కిందట నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ తరుణ్ చుగ్ సమక్షంలో జరిగిన నియోజవర్గస్థాయి సమావేశాలకు హాజరయ్యారు. కేసీఆర్ పై నిప్పులు కురిపించారు. ఇంత చేసినా.. రాజగోపాల్ రెడ్డి మనసంతా కాంగ్రెస్ పైనే ఉందన్న సంకేతాలు ఇవ్వకనే ఇచ్చారు.

## మధుయాష్కీకి వ్యతిరేకంగా పోస్టర్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 5, :కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యాలయంలో పోస్టర్లు వెలిశాయి. గాంధీభవన్ గోడలపై అతికించిన ఈ పోస్టర్లు ఇప్పుడు ఆ పార్టీలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు మధు యాష్కీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మధుయాష్కీకి టికెట్ ఇవ్వొద్దంటూ పోస్టర్లు అతికించడం చర్చనీయాంశంగా మారింది. మధుయాష్కీని ఉద్దేశిస్తూ 'గో బ్యాక్ టు నిజామాబాద్.. పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దు' అంటూ పోస్టర్లపై పేర్కొన్నారు. సేవ్ ఎల్బీ నగర్ అంటూ పోస్టర్లు వేయడంతో కలకలం రేగింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం ఇటీవల కాంగ్రెస్ పార్టీ దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో ఎల్బీ నగర్ సీటు కోసం మధుయాష్కీ దరఖాస్తు చేసుకున్నారు. ఎల్బీనగర్లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు పోటీగా మధుయాష్కీ దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎల్బీనగర్ నియోజక వర్గంలో బీసీ ఓటర్లు అధికంగా ఉండటంతో గెలుపు సులువు అవుతుందనే ఉద్దేంతో మధుయాష్కీ గౌడ్ ఉన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న ఎల్బి నగర్లో 2014లో తెలుగుదేశం పార్టీ తరపున ఆర్ కృష్ణయ్య గెలిచారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన ముద్దగోని రాంమోహన్ గౌడ్ ఓటమిపాలయ్యారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విజయం సాధించారు. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న ముద్దగోని రాంమోహన్ గౌడ్ ఓడిపోయారు. గెలిచిన కొద్దిరోజులకే సుధీర్ రెడ్డి కూడా కారెక్కారు. సుధీర్ రెడ్డి పార్టీ మార్పు తర్వాత? ఇక్కడ మల్ రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్ రెడ్డి రాంరెడ్డి పార్టీ వ్యవహారాలను చూస్తున్నారు. స్థానిక నేతగా పేరున్న స్థానిక నేతగా పేరున్న జక్కిడి ప్రభాకర్ రెడ్డి యాక్టివ్ గా పని చేస్తున్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. ఈసారి టికెట్ తమదే అన్న ధీమాలో ఇద్దరు నేతలు ఉన్నారు. అనూహ్యంగా పార్టీకి చెందిన సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ దరఖాస్తు చేసుకోవడంతో పోటీ నెలకొంది. మధుయాష్కీ గతంలో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీ అభ్యర్థి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. నిజామాబాద్ నుంచి మళ్లీ పోటీ చేసే విషయంలో డైలామాలో పడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించారు. ఇందులో భాగంగానే?. ఎల్బీ నగర్ నియోజకవర్గానికి ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఎల్బీ నగర్ టికెట్ బరిలోకి మధుయాష్కీ రావడంతో ఆయన ప్రత్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో భాగంగానే గాంధీ భవన్లో పోస్టర్లు వెలిసినట్లు చెబుతున్నారు.

## నాలాలో గల్లంతైన బాలుడు మృతి..

(మొదటి పేజీ తరువాయి)

ప్రతియేటా ఇదే పరి స్థితి. ఇంతకీ లోపం ఎక్కడుంది..? వర్షాలు వచ్చినప్పుడు నీళ్లు పోవడం కోసం నాలాలు ఓపెన్ చేసి, అక్కడ సైన్‌బోర్డులు పెట్టకపోవడం మున్సిపాల్టీ అధికారుల నిర్లక్ష్యమేనా..? అనే విమర్శలు వస్తున్నాయి. ప్రగతినగర్ నాలాలో గల్లంతైన బాలుడు మిథున్ (4) మృతిచెందాడు. దాదాపు ఏడు గంటల రెస్క్యూ అనంతరం బాలుడి మృతదేహాన్ని తుర్క చెరువులో గుర్తించారు. వివరాల ప్రకారం.. నిజాంపేట మున్సిపాలిటీ ప్రగతినగర్ ఎన్నారై కాలనీలో అప్పటివరకూ భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో కాస్తా.. తెరిపి ఇవ్వగానే బాలుడు మిథున్ బయటకొచ్చాచేశాడు. తల్లిదండ్రులు కూడా వర్షం లేదు కదా..అని వదిలేశారు. వర్షం లేకున్నా..రోడ్లపై నీరు నిలిచి ఉంటుంది, నాలాలు తెరిచి ఉంటాయి కదా అని ఆ నాలుగేళ్ల బాలుడికి తెలియదు. దాంతో ఎప్పటిలాగే ఆడుకుంటూ మిథున్ ముందుకెళ్లాడు. అక్కడే మృత్యుకుహరం ఉంటుందని తెలియని ఆ బాలుడు పాతాళానికి పడిపోయాడు. వర్షపునీరు పోవడానికి మ్యాన్‌హోల్ తెరిచి ఉంచిన మున్సిపల్ సిబ్బంది, ఎప్పటిలాగే సైన్ బోర్డు పెట్టడం మరిచిపోయారు. వెరసి..ఓ బాలుడి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. అప్పటివరకూ ఇంటిముందు అల్లారు ముద్దుగా తమ కళ్ల ముందు ఆడుకున్న మిథున్.. ఇక లేడన్న విషయం మరిచిపోలేకపోతున్నారు ఆ తల్లిదండ్రులు. కన్నీరుమున్నీరు అవుతున్నారు. మిథున్..మిథున్ అంటూ తల్లి రోదిస్తున్న తీరు, కాలనీవాసులను కలిచివేసింది. బాలుడు తిరిగిరాడన్న చేదునిజాన్ని పేరెంట్స్ జీర్ణించుకోలేకపోతున్నారు. బాలుడి మృతదేహాన్ని గుర్తించి పట్టుకునే సమయంలో ప్రవాహానికి ముందుకు కొట్టుకుపోయిందని స్థానికులు చెబుతున్నారు.

## మండల వనరుల కేంద్రంలో ఘనంగా గురుపూజోత్సవం



ఎర్రుపాలెం : మండల వనరుల కేంద్రానికి సమీపంలో గల విశ్రాంత ఉద్యోగుల భవనం నందు గురుపూజోత్సవ సంబరాలు టీఎస్ యుటిఎఫ్ , పిఆర్టియు ,టి పి టి ఎఫ్ సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈ సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించుకోవడం ఆచారంగా వస్తుంది దానిలో భాగంగానే ఈ సంవత్సరం కూడా మండలంలోని 10 మంది ఉపాధ్యాయులను సీనియర్ ఉపాధ్యాయులుగా గుర్తించి వారికి ఈ సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది. ఇదే కార్యక్రమంలో ఎరుపాలెం మండలం నందు గత 15 సంవత్సరాలుగా కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న మల్లికార్జున్ బదిలీపై బోనకల్లు మండలం వెళ్ళగా వారిని కూడా ఈ సందర్భంగా సన్మానించి ఆర్థిక సహాయం కూడా చేయడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ మరియు జడ్పిటిసి సభ్యురాలు స్థానిక సర్పంచి మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ సమన్వయ సమితి సభ్యులు బి నాగరాజు ఎస్ సంగిరెడ్డి ఎస్ హనుమంతరావు ఏ కోటేశ్వరరావు పి బాలకృష్ణ ఏ బావ్ సన్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఎమ్మార్సీ సిబ్బంది సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు

## దామోదర తో రాజయ్య భేటీ...

వరంగల్, సెప్టెంబర్ 5, : బీఆర్ఎస్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య.. కాంగ్రెస్ సీనియర్ నేత దామోదర రాజనర్సింహతో భేటీ అయ్యారు. ఈ పరిణామం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొంత కాలంగా స్టేషన్ ఘన్ పూర్ రాజకీయాలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రాజయ్యకు ఈసారి హ్యాండ్ ఇచ్చారు కేసీఆర్. ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రాజయ్య రాజకీయ భవిష్యత్ గందరగోళంలోకి నెట్టినట్లు అయింది. అయితే ఆ తర్వాత రాజయ్య వేస్తున్న అడుగులు, చేస్తున్న కామెంట్స్ కూడా? చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో? కాంగ్రెస్ కీలక నేతతో రాజయ్య భేటీ కావటం సంచలన పరిణామంగా మారింది. వరంగల్ వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత దామోదర రాజనర్సింహతో రాజయ్య భేటీ అయ్యారు. హోటల్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ఇద్దరు నేతలు కలిశారు. ప్రస్తుతం వీరి సమావేశానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి. అయితే రాజయ్య కాంగ్రెస్ చేరడం లాంఛనమేనని అనే చర్చ జోరందుకుంది. ఈ పరిణామంతో రాజయ్య ఏం చేయబోతున్నారనేది ఆసక్తికరంగా మారిందిటికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్‌పై ఆగ్రహంతో ఉన్న రాజయ్య.. కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందనే చర్చ వినిపిస్తూ వస్తోంది. కాంగ్రెస్ లేదా బీఎస్పీలో చేరుతారనే టాక్ నడుస్తోంది. ఈ క్రమంలో ఆయన?. దామోదరను కలవటంతో కాంగ్రెస్ లో చేరే దిశగా ఆలోచన చేస్తున్నారా..? అన్న చర్చ తెరపైకి వస్తోంది. అయితే ఈ వార్తలపై రాజయ్య నుంచి ఎలాంటి రియాక్షన్ రాలేదు. వీరి భేటీపై ఆయన ఏం చెబుతారనేది చూడాలి.

# కాంగ్రెస్ పార్టీ అమలు చేసే పథకాల ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించిన రాగిడి లక్ష్మారెడ్డి



వేడిపల్లి సెప్టెంబర్ 5 (ప్రజాపాలన ప్రతినిధి):కాంగ్రెస్ పార్టీ అమలు చేసే పథకాల ప్రచార రథాలను జండా ఊపి ప్రారంభించిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన డిక్లరేషన్లు, మరియు పథకాలను ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి డివిజన్లో గడపగడపకి చేరవేసేలా ఈ ప్రచార రథాలు రూపొందించామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాల గురించి వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టే అభివృద్ధి సంక్షేమాల గురించి వివరిస్తూ ఈ ప్రచార రథల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలోహబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెంట్ కార్పొరేటర్ సుధాకర్ రెడ్డి, హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాలేరు జై నవిన్,మహ్మద్ రఫీక్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్, టిపిసిసి మైనారిటీస్ జనరల్ సెక్రెటరీ సంజయ్ జెన్, టిపిసిసి మైనారిటీ జనరల్ సెక్రెటరీ షేక్ మాదర్ వలీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ శెట్టి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంది శ్రావణ్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, ఎయిమ్స్ చైర్మన్ షబ్బీర్ అలీ, భాను గౌడ్, చిల్కానగర్ డివిజన్ ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్, గోపాల్ యాదవ్, గుంటి గోపాల్, కాసుల సతీష్ గౌడ్, యువజన నాయకులు ప్రేమ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సాల్మన్ బాబు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి సాయిబాబా, శ్యాం కుమార్ ఎండి రిజ్వాన్, ప్రభాకర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, చందు యాదవ్, కరిపే మల్లికార్జున్, పెద్దిరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం మైనారిటీస్ వైస్ చైర్మన్ జహీరుద్దీన్, ఉప్పల్ డివిజన్ మైనారిటీస్ చైర్మన్ గజ్జల రాజు, విన్ను, నవీన్ నాయక్, గిరి,మల్లేష్, మధు, గొల్లూరి ప్రభాకర్, రాహుల్ గౌడ్, మహిళా నాయకురాలు మున్ని బేగం, సుజాత నాయక్, లక్ష్మి, మాలతి, యశ్వంత్, సునీల్, రవి, మదన్, అల్లు, అజీజ్, కార్తీక్, పవన్, రాజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కోర్టు బిల్డింగ్ నిర్మాణం నిధులు మంజూరు చేయాలి



మధిర బార్ అసోసియేషన్ మధిర సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మధిర బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఖమ్మం జిల్లా పోర్టు పోలియో జడ్జి కే. లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలసిన మధిర బార్ అసోసియేషన్. మధిర నూతన కోర్టు బిల్డింగ్ నిర్మాణం కొరకు 13వ తారీకు2-2023 తారీకున 21 కోట్లు రాష్ట్ర హైకోర్టు మంజూరు చేయగా నేటివరకు నిర్మాణ పనులు చేపట్టలేదని మధిర బార్ అసోసియేషన్ విన్నవిస్తూ నిర్మాణ పనులుత్వరితగతిన చేపట్టాలని విజ్ఞాపన చేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ కమిటీ చైర్మన్ కట్టా పూర్ణచంద్రరావు,మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, ఉపాధ్యక్షులు నెల్లూరు రవికుమార్ సీనియర్ న్యాయవాది నంబూరి జనార్ధన్ పాల్గొన్నారు

## మధిర ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో టీచర్స్ డే



మధిర సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలోప్రభుత్వ జూనియర్ కళాశాల మధిర టీచర్స్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన మీటింగ్ లో సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ బి. జై దాస్ , ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొన్నారు. మధిర జూనియర్ కాలేజీలో కొత్త అడ్మిషన్ , రిజల్ట్ విషయంలోనూ కాలేజీ ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందాన్ని కొనియాడారు ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు మంత్రులతో మాట్లాడి. కొత్త బిల్డింగ్ కోసం విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డి , ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు వారితో మాట్లాడి. తప్పకుండా మూడు కోట్ల బిల్డింగ్ శాంక్షన్ చేస్తాను వారు తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు మరియు కళాశాల అధ్యాపక బృందంకి ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి. జై దాస్ నీ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



ఎర్రుపాలెం ఆగస్టు 5 ప్రజా పాలన ప్రతినిధి మండల పరిధిలోని రామన్నపాలెం గోసవీడు గ్రామంలో ప్రగతి హై స్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు ఈ వేడుకకు అతిథిగా శ్రీనిధి పాఠశాల ప్రిన్సిపాల్ బి అంజన్న బాబు పాల్గొన్నారు ప్రగతి హై స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనది ఉపాధ్యాయుడు పిల్లలకు ఆదర్శంగా ఉండాలి అని ఆకాంక్షించారు అనంతరం ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, ఇబ్రహీంపట్నం 320సి ప్రెసిడెంట్ లయన్ ఇందూరి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు








ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి:ఇషా హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఏ సి పి శ్రీనివాస్ రావు ముఖ్య అతిధిగా వచ్చారు. ఈ కార్యక్రమంలో డా.సంపత్ గౌడ్, డా. మహిధర్, డా.మనోజ్, డా.ప్రణయ్, డా. మాధురి మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఇబ్రహీంపట్నం వారి తరపున ఇబ్రహీంపట్నం గవర్నమెంట్ హాస్పిటల్ కి ఈ సిజి ని డాక్టర్ రఘునాథ్ కి అందచేశారు. ఈ కార్యక్రమానికి పిడిజి లయన్ వెంకట్ నారాయణరెడ్డి ఏసిపి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. నల్లకంచె గురుకుల పాఠశాల లోని 10వ తరగతి విద్యార్థినిలకు 100 మందికి పరీక్ష పాడ్స్ మరియు జమెట్రీ బాక్సలు మరియు పెన్నులు అందచేశారు.మాతా పితరుల సేవసదనం లో జన్మదినం సందర్భంగా అశ్రమమం లోని వృద్దులకు భోజనం ఏర్పాటు చేశారు మరియు చీరల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ వెంకట్ నారాయణ్ రెడ్డి, లయన్ కళ్లెం కృష్ణ రెడ్డి, ఆర్ సి లయన్ శ్యామ్ ప్రసాద్, ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ కెవి.రమేష్ రాజు, కోశాధికారి లయన్ భీమ్ రావు, లయన్ మెంబెర్లు లయన్ పాండు రంగా రెడ్డి, లయన్ మోహన్ రెడ్డి, లయన్ బాలరాజ్, లయన్ మహేష్ గౌడ్, లయన్ భీమ్ రావు, లయన్ మల్లేష్ యాదవ్, లయన్ వినోద్ కుమార్,లయన్ శశిధర్, లయన్ ఆలూరి వెంకటేష్ ,లయన్ డాక్టర్.సతీష్ వర్మ మరియు అశ్రమమం సిబ్బంది పాల్గొన్నారు.

## గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన ఎంపీపీ జల్లిపల్లి



అశ్వారావుపేట ప్రజా పాలన (ప్రతినిధి) అశ్వారావుపేట మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు అశ్వారావుపేట శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరావు గారి సూచనల మేరకు అశ్వారావుపేట యంపీపి జల్లిపల్లి శ్రీరామమూర్తి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు వారికి భవిష్యత్తుని ఇస్తారని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ 1888వ సంవత్సరం సెప్టెంబర్ ఐదున తమిళనాడులో జన్మించారు. ఆయన భారత దేశ మొట్టమొదటి ఉపరాష్ట్రపతి అని ఆయన చాలా నిరాడంబరుడుగా జీవించి సత్కార్యాలకు చాలా దూరంగా ఉండేవారని అన్నారు. ప్రతి గురువు కూడా ఆయనలా నడుచుకోవాలి అన్నారు. అలాగే భీమ్ రావ్ అంబేద్కర్ ఆయన తన గురువుగారైనటువంటి అంబేద్కర్ను తన ఇంటిపేరుగా మార్చుకొని భీమ్ రావ్ అంబేద్కర్ గా గురువు మీద అభిమానాన్ని చాటుకున్నారన్నారు. గురువుని ఆ విధంగా గౌరవించాలని అన్నారు. అలాగే గురువులు ఆధునిక కాలంతోపాటు నడుచుకుంటూ పిల్లల భవిష్యత్తుని తీర్చిదిద్దాలన్నారు. గురు అంటే చదువుతోపాటు సంస్కారం నడవడిక అన్ని నేర్పాలన్నారు. ఈ కార్యక్రమానికి మండల తాహసిల్దార్ కృష్ణ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి పి కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీ ఓ సీతారామరాజు, గుడ్ న్యూస్ స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోషి, జోహార్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రవీణ్, వి కే డి వి ప్రిన్సిపల్ శేషుబాబు, చలపతిరావు, రాంబాబు నాయకులు బండి పుల్లారావు, వైస్ ఎంపీపీ చిట్టూరు ఫణీంద్ర, రాజమోహన్ రెడ్డి, సంపూర్ణ, టిఆర్ఎస్ అధికార ప్రతినిధి ఉపాధ్యాయుల సూర్య ప్రకాష్ రావు, ఉపాధ్యాయులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి సెప్టెంబర్ 5 (ప్రజాపాలన ప్రతినిధి): సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతీ సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. హబ్సిగూడ ఎమ్మెల్యే నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేతుల మీదుగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు గోవిందమ్మ రూ 60 వేలు, హాజిరబాను రూ 60 వేలు, బాలమణి రూ 60 వేలు, హేమలత రూ 23 వేలు, సాయి కృష్ణ రూ 20 వేలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గరిక సుధాకర్, డాక్టర్ బి.వి చారి, పెంటారెడ్డి, చంద్ర మౌళి, నంది కంటి శివ , కొంగల శ్రీధర్, జె సి బి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మధిర సేవాసమితి ఆధ్వర్యంలో "ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



మధిర సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మధిర సేవా సమితి ఆధ్వర్యంలో పల్లపోతుల ప్రసాద్ వారి ఇంటి దగ్గరఈరోజు సెప్టెంబర్ 5 తేదీన శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టినరోజు మరియు గురు పూజోత్సవం పురస్కరించుకొని మధిర సేవా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారుఈ వేడుకలు మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు అధ్యక్షతన ముఖ్య అతిథులు పెద్దలు ఇరుకుళ్ళ లక్ష్మీనరసింహారావు దాచేపల్లి ముత్యాలు ఆధ్వర్యంలో "సన్మాన గ్రహీతల శ్రీమతి కోలా పద్మావతి హెచ్ఎం ఇన్చార్జి - మడుపల్లిమేడేపల్లి శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్ అప్పారావు, సీనియర్ టీచర్, పిఎస్-హరిజనవాడ,మర్ళకట్ల చిన్న వెంకటరావు ఎస్ జి టి - పి ఎస్ లిశాలువా స్వీట్స్ తోఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మెరుగైన విద్యార్థి ఉన్నప్పటికీ అతను సరైన గురువుల చేతిలో పడితే ఉన్నత శిఖరాలను అందుకోగలడు అందుకే "గురువు లేని విద్య- గుడ్డి విద్య" అని తెలియజేశారు అమ్మా- నాన్న కంటే ఎక్కువ సమయం గురువు దగ్గర గడుపుతూ గురువు సమక్షంలో నేర్చుకునే విద్య అర్థాన్ని, పరమార్థాన్ని ఇస్తుందని పెద్దలు తెలిపారు అందుకే గురువుని దైవం ప్రక్కన కూర్చోబెట్టారుఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ గారు ఉపాధ్యాయ వృత్తికి అపారమైన గౌరవం తీసుకుని వచ్చిన మహానుభావుడు వారు భారత రాష్ట్రపతి 1962 ఉన్నప్పుడు తన పుట్టినరోజు ఉపాధ్యాయుల గౌరవ దినముగా జరుపుకోవడం ఆయనకు చాలా సంతోషాన్ని ఇచ్చినదని అధ్యక్షులు ప్రసాద రావు మాట్లాడారుఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మధిర సేవా సమితి సేవలు అభినందినీమని, సేవా కార్యక్రమం పట్ల నిబద్ధతో సేవలందిస్తున్న కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారుఈ కార్యక్రమంలో మదిర సేవా సమితి సభ్యులు కోమటిడి శ్రీనివాసరావు, వందనపు శ్రీనివాసరావు, యర్రా లక్ష్మణ్, షేక్ జహంగీర్, కోమటి సుధాకర్, చలవాది కృష్ణమూర్తి (ఆర్టిసి రిటైర్డ్ ఎంప్లాయ్), దొడ్డా శ్రీనివాసరావు, దూపుకుంట్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

## పలు అంగన్వాడి కేంద్రాల్లో పోషణ మాసం: ఐసీడీఎస్ సీడీపీఓ శారద శాంతి



మధిర రూరల్ సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో ప్రాజెక్టులోని మధిర 1సెక్టార్ 5,6,7,15 నందు మధిర -15, అంగన్వాడీ కేంద్రంలోని పోషకాహార వారోత్సవాలు మంగళవారం ఐసిడిఎస్ సీడీపీఓ శారద శాంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మధిర -15 సెంటర్ ఏరియా పరిధిలో పోషణ మాసంలో భాగంగా ఈ సందర్భంగా సీడీపీఓ శారద శాంతి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పోషకాహార వారోత్సవాలపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. మనము రోజువారి తినే ఆహారంలో చిరుధాన్యాలు ఉండే విధంగా చూసుకోవాలి, అనుబంధ పోషకాహారం ఆహారంపై విద్యపై అవగాహన సదస్సు, పెరుగుదల పర్యవేక్షణ గురించి వివరించడం జరిగింది,శిశువుకు రోగ నిరోధక శక్తి పెరగాలంటే తల్లిపాలు తప్పక పాటించాలని వివరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి కుమారి . ఐసీడీఎస్ అంగన్వాడీ టీచర్స్ , అంగన్వాడి, ఆయాలు, హెల్త్ డిపార్ట్మెంట్ సిహెచ్ఓ అఖిల ఏఎన్ఎం విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిత్తారు నాగేశ్వరావు జన్మదిన వేడుకలు



మధిర సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు ఈరోజు స్థానిక టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ హాజరై చిత్తారు నాగేశ్వరావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కాలే యాదయ్య పై సొంత పార్టీ నేతల తిరుగుబాటు

**అధికారం అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు.**

**20 సంవత్సరాలకు ఒకసారి రిజర్వేషన్ వస్తే , ఒకే కుటుంబానికి పదవులా ?**

**పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలపై ఎమ్మెల్యే కక్ష సాధింపు.**

**ఎమ్మెల్యే కాలే యాదయ్య టిక్కెట్టు రద్దు చేయాలి.**

**లేదంటే పార్టీకి నష్టం కలుగుతుంది.**

**మొయినాబాద్ మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు ..**



చేవెళ్ల సెప్టెంబర్ 05,(ప్రజాపాలన): వంగి వంగి దండాలు పెట్టి కాళ్ళు మొక్కి 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచి , టిఆర్ఎస్ పార్టీలోకి చేరిన ఎమ్మెల్యే కాలే యాదయ్య బిఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని , మొయినాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మంగళ వారం చేవెళ్ల మండల కేంద్రంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలే యాదయ్య మొయినాబాద్ మండలంలో అవినీతి అక్రమాలను పాల్ పడుతున్నారని ,హైదరాబాదుకు అతి సమీపంలో ఉన్నటువంటి మా మండలంలో ఎవరైనా కొత్తగా ఫామ్ హౌస్ లు నిర్మించడానికి వస్తే వాళ్ల నుండి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని, కొత్తగా వెంచర్లు చేయడానికి ముందుకు వస్తే ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకొని అధికారుల చేత అడ్డంకులు సృష్టించి వాళ్ళనుండి ప్లాట్లను , డబ్బులను అక్రమంగా వసూలు చేస్తున్నారని, ఇలాంటి అవినీతి కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తికి టిఆర్ఎస్ పార్టీ తరఫున బీఫామ్ ఇస్తే ఓడిపోవడం ఖాయం, అన్నారు. అలాంటి ఓడిపోయే వ్యక్తికి టికెట్టు ఇచ్చేకంటేపార్టీ నుంచి ఏ వ్యక్తికి టికెట్ ఇచ్చిన గెలిపించుకుంటామని, అన్నారు. ఎప్పుడో 20 సంవత్సరాలకు ఒకసారి మహనీయుడు అంబేద్కర్ ఇచ్చినటువంటి అవకాశాలతో ఎస్సీలకు రిజర్వేషన్ వస్తే, చెవెళ్ళ నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులే లేనట్టుగా , ఎమ్మెల్యే కాలే యాదయ్య కుటుంబ పాలన సాగిస్తున్నారని, మొయినాబాద్ లో ఆయన కుమారుడు జడ్పిటిసి కిపోటీ చేసిన, అయిన మండల ప్రజలు టిఆర్ఎస్ పార్టీ మీద అభిమానంతో గెలిపిస్తే ఆయన కొడుకు కూడా అధికార దుర్వినియోగం చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ డబ్బులు వసూలు ఉన్నారని , అన్నారు.పార్టీ తరఫున ఇచ్చేటటువంటి నామినేషన్ పదవులు కూడా అవకాశవాదుల దగ్గర నుండి లక్షలలో డబ్బులు తీసుకొని పదవులు ఇచ్చారని మండిపడ్డారు. ఇలాంటి అవినీతిపరునికి టిఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ ఇవ్వడాన్ని మొయినాబాద్ చెందిన మేము ముకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నాం అన్నారు. ఇట్లాంటి అవినీతి ఆరోపణలు ఉన్నటువంటి వ్యక్తి వల్ల పార్టీకి నష్టం జరగకుండా యాదయ్య పై ప్రజలలో వ్యతిరేకత ఉందని , చేవెళ్ల అసెంబ్లీ టికెట్లు ను అధిష్టానం సీఎం కేసీఆర్ కేటీఆర్ పున పరిశీలన చేసి , పార్టీలో మరి ఎవరికైనా టికెట్ ఇచ్చిన కష్టపడి గెలిపించుకుంటామని మీడియా ద్వారా తెలియుజేస్తున్నామని అన్నారు. లేదంటే చేవెళ్లలో టిఆర్ఎస్ పార్టీకి నష్టం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నక్కలపల్లి ఎక్స్ సర్పంచ్ నీలకంఠం, చిన్న మంగళారం ఎక్స్ ఎంపీటీసీ యాదయ్య నక్కలపల్లి ఆనంద్ ఎక్స్ ఎంపిటిసి అజిత్ నగర్ పిఎసిఎస్ ఎక్స్ చైర్మన్ మాధవరెడ్డి సురంగల్ మాజీ ఉప సర్పంచి జైపాల్ రెడ్డి రామిరెడ్డి కనకమామిడి ఉప సర్పంచ్ మంగళవారం రాజు నక్కలపల్లి ఉప సర్పంచ్ లక్ష్మణ్ కుమార్ వెంకటాపూర్ ఎక్స్ ఎంపీటీసీ మొయినాబాద్ సీనియర్ నాయకులు హనుమంతు యాదవ్ మోహన్ గౌడ్ ఎక్స్ ఎంపిటిసి హరినాథ్ బాకారం ఎక్స్ సర్పంచ్ మోత్కుపల్లి కో ఆప్షన్ మెంబర్ బొర్ర శేఖర్ టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓంఆదిత్య గాయత్రి స్కూల్ లో గురుపూజోత్సవం..



ఏన్కూరు, సెప్టెంబర్ 5 (ప్రజా పాలన న్యూస్):మాజీ రాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం సందర్భంగా ఏన్కూర్ మండలం తిమ్మరావుపేట గ్రామంలో ఉన్న ఓం ఆదిత్య గాయత్రి స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంపాలన దినోత్సవం ఏర్పాటు చేసి విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యార్థులకు పాఠాలు భోధించారు. తొలుత స్కూల్ కరస్పాండెంట్ దాసరి రమేష్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయనను స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాండూర్లో వేడేక్కుతున్న రాజకీయం

తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి తాండూర్లో రాజకీయం రోజు రోజుకు వేడెక్కుతుంది. కాంగ్రెస్ పార్టీలో టికెట్ కోసం త్రిముఖ పోటీ ఏర్పడింది. మాజీ మంత్రి కుమారుడు రమేష్ మహరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిచ్చన్న గారి లక్ష్మ రెడ్డి అదేవిధంగా కోడంగల్ ప్రాంతవాసి సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి కాంగ్రెస్ టికెట్ కోసం పోటుపడుతున్నారు. అదేవిధంగా బిజెపి పార్టీలోనూ టికెట్ కోసం నలుగురు పోటీ పడుతున్నారు. తాండూరు మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏ విధంగా మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ రమేష్ గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు మురళీకృష్ణ గౌడ్ టికెట్ కోసం పోటీపడుతున్నారు,. భారతీయ రాష్ట్ర సమితి అభ్యర్థిని పార్టీ ప్రకటించడంతో తాండూరులో రెండు వర్గాలు కలుసుకునే ప్రయత్నం జరుగుతుందని రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తాండూర్ లో బహుజన పార్టీ బహుజన సమాజ్ పార్టీలో వారి పోటీ చేస్తుంది. ప్రాంతం నుంచి ప్రాంతంలో నాలుగు పోటీలు పోటీకి సాయి అంటున్నాయి. నువ్వా నేనా అనే విధంగా ఆప్యాయతలు రాజకీయ నాయకులు పాల్గొంటున్నారు..

## కంటి వైద్యం చేయించిన ఎన్జీవో శ్రీనివాస్..



తల్లాడ, సెప్టెంబర్ 5 (ప్రజా పాలన న్యూస్): తల్లాడ మండలం బాలంపేట గ్రామానికి చెందిన చిట్టెం వీరయ్య కంటి శుక్లాలు ఏర్పడి చూపు కన్పించని కారణంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ఈ విషయం తెలుసుకున్న మా రతమ్మ సేవా సంస్థ నిర్వాహకులు ఇస్నాపల్లి శ్రీనివాస్ మంగళవారం ఆయనను హైదరాబాద్ తీసుకెల్లి కంటి వైద్య చికిత్సలు చేయించారు. పాల్వంచ యల్ వీ ప్రసాద్ హాస్పిటల్ నందు యెడమ కంటికి డాక్టర్ ,,సిద్దార్థ దీక్షిత్,, వారీచే మారో కంటికి చికిత్యా చేసి బాధిత రోగికి ఆపరేషన్ అనంతరం తగు సలహాలు సూచనలు, అందించి ఔశదములు అందించిన వైద్య నిపుణులు. ఇటువంటి నీరుపేద రోగులకు తోడుగా వచ్చి చేయుతగా నిలిసీ పలూ మార్లు సహాయంగా నిలిచిన సేవకుడు,,మా రత్నమ్మ స్వాచ్ఛంద సేవా సొసైటీ,, నిర్వాహకులు ఇస్నపల్లి శ్రీనివాస్ సేవలు కొనియాడి హైదరాబాద్ డాక్టర్ సిద్ధార్థ దీక్షిత్ అభినందించారు.

## ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ బుగ్గరాములు డిమాండ్



ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 5 ప్రజాపాలన ప్రతినిధి: సిఐటియు ఆధ్వర్యంలో ఎలిమినేడు మెడికల్ ఆఫీసర్ నాగయ్య, దండుమైలారం మెడికల్ ఆఫీసర్ పూర్ణంలకు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియూ మండల కన్వీనర్ బుగ్గరాములు మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి పని చేస్తూ ప్రారంభం నుండి ఇప్పటివరకు ప్రభుత్వ నిర్మించిన అనేక ట్రైనింగ్ లు పొందారు. రిజిస్టర్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్లైన్ పని చేయడం, బిపి, షుగర్స్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారు. తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తూ వీటితోపాటు గర్భిణి, బాలింతలు చిన్న పిల్లలకు సేవలందిస్తున్నారు. కరోనా మహమారి కాలంలో కరోనా నియంత్రించడంలో ఆశ వర్కర్లు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. డబుల్ హెచ్ఓ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశ వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించింది. ఇన్ని పనులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశాలకు నేటికీ ఫిక్స్ వేతనం నిర్ణయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రస్తుతం ఆశలకు రూ.9750/-లు పారితోషికాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్న ఒకవైపు పని భారం పెరుగుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారితోషికం లేని అదనపు పనులు ఆశాలతో చేయించడం సరైనది కాదు. 2021 జులై నుండి డిసెంబర్ వరకు రావాల్సిన 6నెలల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. కేంద్రం చెల్లించిన కరోనా రిస్కు అలవెన్స్ నెలకు 1000 చొప్పున 16 నెలల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ఆశలకు పని భారం తగ్గించి, జాబు చాట్ ను విడుదల చేయాలి. కనీస వేతనం 18వేలు నిర్ణయించి పారితోషికాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 11వ తేదీన జరిగే ఆశల ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో ఆశ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు యాదగిరి, ఆశ వర్కర్లు సుకన్య, మణెమ్మ, భాగ్యలక్ష్మి, లలిత, లావణ్య, నాగమణి, యాదమ్మ, చంద్రకళ, మరియమ్మ, జయమ్మ, కవిత, సుమిత్ర, మంజుల, సుమిత్ర, అండాలు, సరిత, మాధవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్**



చేవెళ్ల సెప్టెంబర్ 05, (ప్రజాపాలన): చేవెళ్ల మండలం ఆలూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని , రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన తెలియజేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పాల్గొని మాట్లాడారు ఆశా కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషకాలను 18 వేలకు పెంచి ఫిక్స్ వేతనంగా నిర్ణయం చేయాలని అన్నారు ఆశలకు ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు .అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు .ఆశా కార్యకర్తల చేవెళ్ల మండల అధ్యక్షురాలుగా అన్నపూర్ణ ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి కోశాధికారిగా శాంత సహాయ కార్యదర్శులుగా పావని హేమలత ఉపాధ్యక్షులుగా అనురాధ పద్మ సలహాదారులుగా ధనలక్ష్మిలి మిగిలిన వారి అందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు అనేక పోరాటాలు చేస్తుందని రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ పిలుపులను తూచ తప్పకుండా అమలు చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..

## సత్యసాయి విద్యాసంస్థలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



మేడిపల్లి, సెప్టెంబర్ 5 (ప్రజాపాలన ప్రతినిధి) :రామంతాపూర్ వెంకట్ రెడ్డి నగర్లోని సత్యసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాసంస్థల చైర్మన్ గడ్డం సాయికిరణ్ పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఉపాధ్యాయుల పాత్ర పోషించిన తీరు హర్షణీయమని అన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా విద్యార్థులను తీర్చితే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా సమాజంలో వివిధ రంగాల్లో జాతికి సేవలందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేష్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ యువజన సంఘం అధ్యక్షునిగా తెలుగు శ్రీనివాస్

**ముదిరాజుల ఆరాధ్య దైవం పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్టాపనకు ప్రతిఒక్కరుకృషి చేయాలి**

**ముదిరాజ్ యువజన సంఘం అధ్యక్షులు తెలుగు శ్రీనివాస్**



చేవెళ్ల సెప్టెంబర్ 05,(ప్రజాపాలన):ముదిరాజ్ ఆరాధ్య దైవం పండగ సాయన్న విగ్రహ ప్రతిష్టాపనకు ముదిరాజ్ సమాజమంతా కృషి చేయాలని యువజన అధ్యక్షులు తెలుగు శ్రీనివాస్ తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముదిరాజ్ యువజన సంఘం మండల కమిటీని నియమించింది. మండల యువజన సంఘం అధ్యక్షులుగా తెలుగు శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా ఊరడి రవి తెలుగు నవీన్ తెలుగు కృష్ణమోహన్ చామంతి యాదగిరి కావలి వెంకటేష్ ప్రధాన కార్యదర్శులుగా అనిల్ శీలాపురం మహేష్ బంటు మల్లేష్ బంగారు శివకుమార్ కోశాధికారిగా తెలుగు యాదయ్యను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్యక్షులు తెలుగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ముదిరాజ్ కులానికి జరుగుతున్న అన్యాయంపై ఎదిరించాలని పిలుపునిచ్చారు. అలాగే చేవెళ్ల నియోజకవర్గంలోని ముదిరాజులు ఏకమై మన ఐక్యతను చాటి చెప్పాలన్నారు. ముదిరాజుల ఆరాధ్య దైవం పండగ సాయన్న. భూస్వాములకు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసి అనగారిన వర్గాల జీవితాలలో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి. ఉన్న వాడి దగ్గర దోచి లేనివాడికి పంచిపెట్టి తెలంగాణ రాబిన్ హుడ్ గా పేరుగాంచారు.ముదిరాజుల ఆరాధ్య దైవం పండగ సాయన్న విగ్రహ ప్రతిష్టాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు..

## అన్నారుగూడెంలో పోషకాహార వారోత్సవాలు..



తల్లాడ, సెప్టెంబర్ 5 (ప్రజాపాలన న్యూస్):తల్లాడ మండలంలోని అన్నారుగూడెం సెక్టార్ అన్నారుగూడెం 6వ సెంటర్ లో పోషకాహార వారోత్సవాలు బొగ్గల వారు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారేళ్ల మమత, ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణకుమారి హాజరై మాట్లాడుతూ పోషకాహారం, గురించి పోషక విలువలు, పరిశుభ్రంత, సమతుల్య ఆహారం, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆకుకూరలు మన పెరటి లొనే ఎలా పెంచుకోవాలి, ఎనిమియా, గురించి వివరించారు. గర్భిణిలకు సీమంతలు, అనప్రాసనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ హాబీమునిసి బేగం, ఉప సర్పంచ్ భాగ్యమ్మ, ఆశా కార్యకర్త,అంగన్వాడీ ఉపాద్యారాళ్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



## మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి" రన్ టైమ్ లాక్డ్?




స్టార్ నటి అనుష్క శెట్టి మరియు యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి అనే రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ కోసం జతకట్టారు. ఈ పాన్ ఇండియా మూవీకి మహేష్ బాబు పి దర్శకత్వం వహించారు. ఈ గురువారం ఈ సినిమా థియేటర్ల లోకి రానుంది. ఇప్పటికే సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ సినిమా యు/ఎ సర్టిఫికేట్ పొందగా, ఇప్పుడు 2 గంటల 29 నిమిషాల నిడివితో తెరకెక్కినట్లు సమాచారం. దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యూవీ క్రియేషన్స్ నిర్మాణ సంస్థ నిర్మించిన ఈ చిత్రంలో జయసుధ, మురళీ శర్మ, అభినవ్ గోమతం తదితరులు కీలక పాత్రలు పోషించారు. రధన్ సంగీతం సమకూర్చారు.

## జవాన్ బాక్సాఫీస్.. ముందస్తు హెచ్చరిక



బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం జవాన్. ఈ మూవీ పై మొదటి నుంచి అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి. తీరా, ట్రైలర్ విడుదలయ్యాక, ఆ అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఈ క్రమంలో ఈ సినిమా విడుదలకు ముందే రికార్డులు క్రియేట్ చేసే పనిలో పడింది. మూవీ మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు వస్తోంది అనగా, అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేశారు. అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ కావడంతో, అభిమానులు రెచ్చిపోతున్నారు. విపరీతంగా మూవీ టికెట్స్ బుక్ చేసుకుంటున్నారు. బాలీవుడ్ లో మాత్రమే కాదు, తెలుగు రాష్ట్రాల్లోనూ విపరీతంగా టికెట్స్ బుక్ అవుతుండటం విశేషం. ఈ స్పందనకు మూవీ టీమ్ ఆనందంలో మునిగి తేలుతోంది. ఈ బుకింగ్స్ చూస్తుంటే, పఠాన్ కి మించిన హిట్ షారూక్ జవాన్ తో అందుకునే అవకాశం స్పష్టంగా కనపడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో పఠాన్, గదర్ 2 కంటే ఎక్కువ అడ్వాన్స్ బుకింగ్ ఈ సినిమాకే నమోదు కావడం విశేషం. అడ్వాన్స్ బుకింగ్ బిజినెస్ లో గదర్ 2ని జవాన్ అధిగమించడం విశేషం. ఈ క్రమంలో ఓపెనింగ్స్ అదరిపోతాయని మూవీ టీమ్ భావిస్తోంది. ఈ మూవీలో షారూక్ ని చూడటానికి ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారనే విషయం అర్థమౌతోంది. పఠాన్ మూవీ దేశవ్యాప్తంగా రూ.57కోట్ల నికర లాభంతో ప్రారంభమైంది. ఇప్పుడు జవాన్ దానికి మించేలా ఉంటుందని తెలుస్తోంది.

ఈ సినిమా తమిళ డైరెక్టర్ అట్లీ దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 7వ తేదీన ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా, సెప్టెంబర్ 5 వ తేదీ ఉదయం 6 గంటల నాటికి ఏడు లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ జవాన్ మూవీలో విజయ్ సేతుపతి విలన్ గా నటిస్తున్నారు. ఆయన లుక్ కూడా చాలా డిఫరెంట్ గా ఉంది. ఈ సినిమాని రెడ్ చిల్లీస్ ఎంటర్ట్రైన్మెంట్ బ్యానర్ పై షారూక్ భార్య గౌరీ ఖాన్ నిర్మిస్తుండటం విశేషం. ఈ మూవీ వివిధ భాషల్లో పాన్ ఇండియా మూవీ గా విడుదలౌతోంది.

## నాని ది న్యాచురల్ స్టార్..!




ఎంచుకున్న పాత్రకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే స్టార్స్ లో నాని ఒకరు. అష్టా చమ్మ సినిమాతో హీరోగా తన కెరీర్ మొదలు పెట్టినా అసలు అతను పరిశ్రమలోకి వచ్చిన నాని మొదట అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేశారు. అలా అసిస్టెంట్ గా చేస్తున్న టైం లో ఇంద్రగంటి మోహనకృష్ణ నానిని హీరోగా పరిచయం చేశారు. మెయిన్ గోల్ హీరోయినే అయినా వచ్చిన ఛాన్స్ వదలకూడదు అన్నట్టుగా దర్శకత్వ శాఖలో పని చేశాడు నాని. అలా అసిస్టెంట్ డైరెక్టర్ గా మొదలు పెట్టి హీరోగా మారిన నాని అష్టా చమ్మా నుంచి కెరీర్ గ్రాఫ్ పెంచుకుంటూ సక్సెస్ ఫుల్ గా 15 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు. తెర మీద నానిని చూడగానే మన పక్కింటి కుర్రాడిలా అనిపిస్తాడు. అదే అతనికి ప్లస్ పాయింట్. ఇక ఎలాంటి పాత్ర ఇచ్చినా సరే పర్ఫెక్ట్ గా సూట్ అవుతాడు. అందుకే అతని సినిమాలు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యేలా చేశాయి. తన సహజ నటనకు న్యాచురల్ స్టార్ అన్న ట్యాగ్ లైన్ ని కూడా వచ్చేలా చేసింది. అష్టా చమ్మా నుంచి మొదలైన నాని సినీ జర్నీ ఈ మార్చిలో వచ్చిన దసరా వరకు కెరీర్ లో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చాడు. ముఖ్యంగా దసరాతో తన వల్ల కాదని అనుకున్న మాస్ ఫీట్ కూడా సూపర్ హిట్ కొట్టి సత్తా చాటాడు నాని. ప్రతి సినిమాకు తన పరంగా 100కి 100 శాతం కష్టపడి పనిచేసిన నాని హిట్ అయిన సినిమాను ప్రోత్సాహంగా తీసుకుని ఫెయిల్ అయిన సినిమాతో పాఠాలు నేర్చుకుని కెరీర్ కొనసాగిస్తూ వచ్చాడు. ముఖ్యంగా ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా వచ్చిన నాని న్యాచురల్ స్టార్ గా 15 ఏళ్లు సక్సెస్ ఫుల్ కెరీర్ కొనసాగించడంలో అతని ప్రతిభ ఏంటన్నది చెప్పొచ్చు. నాని సినిమాలకు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఉంటుంది. నాని సినిమా కచ్చితంగా బాగుంటుంది అని నమ్మే ఆడియన్స్ అతని సినిమాలన్నీ రెగ్యులర్ గా చూస్తుంటారు. ఇదే కాదు తనలా అవకాశం కోసం ఎదురుచూసే ప్రతి ఒక్కరికి ఒక ఆశాకిరణం గా నాని మారుతున్నాడు. నాని చేసిన 29 సినిమాల్లో నాని కొత్త వారితో చేసిన సినిమాలే ఎక్కువ. తన కెరీర్లో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న దసరా సినిమాతో కూడా శ్రీకాంత్ ఓదెల అనే దర్శకుడిని పరిచయం చేశాడు నాని. టాలెంట్ ఉన్న వారిని ప్రోత్సహిస్తూ నాని అలా కూడా తన మంచి మనసు చాటుకుంటున్నాడు. హీరోగా సంపాదించడం మాత్రమే కాదు ఇక్కడ సంపాదించింది ఇక్కడే ఖర్చు పెట్టాలి అనేలా సినీ నిర్మాణం కూడా చేస్తున్నాడు నాని. నిర్మాతగా నాని అభిరుచి గల సినిమాలు చేస్తూ వస్తున్నాడు. యువ హీరో నుంచి స్టార్ హీరోగా నాని కెరీర్ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తుంది. మనలోని ప్రతిభ అనుకున్నది సాధించే వరకు పట్టు విడవని సంకల్పం ఉంటే చాలు అనుకున్నది సాధించి తీరుతాం అనేలా నాని ని చూస్తే అర్థమవుతుంది. ఈ తరం ఆడియన్స్ కి స్వయంకృషితో పైకొచ్చిన నాని ఎంతో స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పొచ్చు. సినీ పరిశ్రమలో 15 ఏళ్లు పూర్తి చేసుకున్న నానికి శుభాకాంక్షలు తెలుపుతూ దసరా లాంటి విజయాలు ధరణి లాంటి పాత్రలతో పాన్ ఇండియా లెవెల్ లో ఇంకా ఎంతోమంది ప్రేక్షకులను అలరించాలని కోరుకుందాం.

## విజయ్ 68 లో ఫైనల్ గా ఈ యంగ్ హీరోయిన్?



కోలీవుడ్ ఇళయ దళపతి విజయ్ జోసెఫ్ హీరోగా ఇప్పుడు నటించిన అవైటెడ్ చిత్రం "లియో" పై సెన్సేషనల్ అంచనాలు నెలకొన్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రం తర్వాత విజయ్ తన కెరీర్ లో 68వ సినిమాని దర్శకుడు వెంకట్ ప్రభు తో అనౌన్స్ చేసిన విషయం కూడా అందరికీ తెలుసు. ఇపుడు ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ సూపర్ ఫాస్ట్ గా జరుగుతుండగా గత కొన్నాళ్ల నుంచి ఈ సినిమా హీరోయిన్స్ విషయంలో అయితే ఓ బజ్ వైరల్ గా మారింది. ఈ చిత్రంలో ఓ సీనియర్ హీరోయిన్ తో పాటుగా ఓ యంగ్ హీరోయిన్ కూడా నటిస్తుంది అని టాక్ ఉండగా ఇప్పుడు ఈ యంగ్ హీరోయిన్ గా అయితే నటి ప్రియాంక అరుళ్ మోహన్ ఫిక్స్ అయ్యినట్టుగా ఇప్పుడు కోలీవుడ్ వర్గాలు చెప్తున్నాయి. దీనితో విజయ్ సినిమాలో మొదటి సారి ఈ యంగ్ హీరోయిన్ కనిపిస్తుంది అని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తుండగా వచ్చే ఏడాది మేకర్స్ ఈ సినిమాని విడుదల చేయనున్నారు.

## వామ్మో.. ఆ మ్యూజిక్ డైరెక్టర్ కి రూ.10 కోట్లు?



ఈ మధ్య కాలంలో సౌత్ హీరోలు, దర్శకులు బాలీవుడ్ హీరోలు, దర్శకులను మించి పారితోషికం తీసుకుంటున్నారు అనడంలో సందేహం లేదు. ఒకప్పుడు సౌత్ స్టార్స్ కి ఉత్తర భారతంలో పెద్దగా గుర్తింపు ఉండేది కాదు. కానీ ఇప్పుడు బాలీవుడ్ హీరోలకు సమానంగా చాలా మంది సౌత్ హీరోలు అక్కడ కూడా స్టార్ డంను దక్కించుకోవడం తో పాటు భారీ పారితోషికం ను అందుకుంటున్నారు. హీరోలు, దర్శకులు మాత్రమే కాకుండా బాలీవుడ్ లో అత్యధిక పారితోషికం దక్కించుకుంటున్న సంగీత దర్శకులు కూడా సౌత్ వారే కావడం విశేషం. చాలా కాలం నుండి బాలీవుడ్ సంగీత దర్శకులతో పోల్చితే రెహమాన్ కి అత్యధిక పారితోషికం అందుతోంది. సౌత్ తో పాటు బాలీవుడ్ లో భారీ పారితోషికం తీసుకున్న రహమాన్ రేంజ్ ఈ మధ్య తగ్గినట్లే అనిపిస్తోంది. రెహమాన్ కి దరిదాపుల్లో గతంలో ఏ సంగీత దర్శకుడు ఉండేవాడు.

కానీ ఇప్పుడు ఆయనకు పోటీగా అనిరుధ్ వచ్చినట్లు అనిపిస్తుంది. ఈ మధ్య కాలంలో అనిరుధ్ వరుసగా సినిమాలు కమిట్ అవుతున్నాడు. సక్సెస్ రేటు కూడా భారీగా ఉంది. అందుకే అనిరుధ్ ఏకంగా తన పారితోషికంను రూ.10 కోట్లకు పెంచారు అంటూ తమిళ సినీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.

## ప్రభాస్ ఒక సినిమా అవుట్ ఒక సినిమా ఇన్.?



ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన సినిమాలు రిలీజ్ కోసం మళ్ళీ మునుపటిలానే పరిస్థితి ఏర్పడింది. ఏ ఒక్క సినిమా కూడా అనుకున్నట్టుగా సమయానికి రాలేకపోయాయి. దీనితో ఫ్యాన్స్ కి అంతకంతకు ఎదురు చూపులు పెరుగుతూ వస్తుండగా ఈ ఏడాదిలోనే రెండు రిలీజ్ లు ఉంటాయి అనుకుంటే రెండో రిలీజ్ కావాల్సిన భారీ చిత్రం "సలార్" వాయిదా వార్తలు డిజప్పాయింటింగ్ గా మారాయి. ఇక ఇదిలా ఉండగా ఈ చిత్రం రిలీజ్ ఎప్పుడు అనేది ఆసక్తిగా మారగా ఈ చిత్రం రిలీజ్ పై పలు డేట్ లు ఇప్పటికే వైరల్ అవుతున్నాయి. అయితే లేటెస్ట్ గా ఈ సినిమా సంక్రాంతి రేస్ రిలీజ్ అంటూ కూడా కొన్ని రూమర్స్ స్టార్ట్ అయ్యాయి. మరి ఇది నిజం అయితే ఆ రేస్ లో అల్రెడీ ఉన్న కల్కి చిత్రం ప్లేస్ లో సలార్ ఉంటుంది అని చెప్పాలి. సో ఒక సినిమా ప్లేస్ లో ఇంకో సినిమా పడుతుందో లేదో అనేది మాత్రం కాలమే నిర్ణయించాలి.

కొత్త రాజకీయ పార్టీ
పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి
ఆశయాల సాధన కొరకు త్వరలో ఏర్పాటు

బహుజనులు అంటే ఎవరు?
ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్క మైనారిటీ SC,ST,BC,OC కులాల్లో ఉన్న ప్రజలందరు బహుజనులే

బీసీలను సీఎం చెయ్యాలి
డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చెప్పిన మాస్టర్ కీ ని సాధించడమే మా నినాదం
అధిక జనాభా ఉన్న BCని CM చేయాలనేది లక్ష్యం

50% రిప్రజెంటేషన్
మహిళలకు 50% రిప్రజెంటేషన్ (రిజర్వేషన్స్) కల్పించడమే మా ధ్యేయం

ఆలోచించండి!
- 2016 లెక్కల ప్రకారం నేషనల్ శాంపిల్ సర్వే (NSSO) వారు కులాల జనాభా నిష్పత్తి BC 41%, SC 20%, ST 9%, OC 30%
- ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్స్ BC 27%, SC15.5%, ST 7.5%, OC 50%

ఆలోచించండి!
రిజర్వేషన్ కావాలా? రిప్రజెంటేషన్ కావాలా?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ కావాలని ప్రతిపాదిస్తుంది

కుల రహిత సమాజం
డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోరుకున్న కులరహిత సమాజం కొరకు కులాంతర వివాహం చేసుకున్న వారి పిల్లలకు మరియు కులం వద్దు అనేవారికి సమతా కులం అని నమోదు చేయటానికి మద్దతు

SC ల మతస్వేచ్ఛకు మద్దతు :
ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలకు మద్దతిస్తే సభ్యులుగా చేరండి

5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి MLA గా, MLC గా ఉండాలని సమర్థిస్తుంది

రిజర్వేషన్ సిస్టమ్ వలన బాధ పడుతున్న OC/FC లను ABCD లుగా విభజించాలి

ఆంధ్రప్రదేశ్ జనాభా లో 15% ఉన్న కాపులకు 15% రిజర్వేషన్స్ (రిప్రజేంటేషన్స్) ఇవ్వాలి

మండల్ కమీషన్ రిపోర్ట్స్ ను ఆచరించడం
సచార్ కమిటీ రికమెండేషన్స్ ఆచరించడం
సబ్ ప్లాన్ ఫండ్స్ సద్వినియోగం అయ్యేలా చెయ్యడం
కుల జనగణన జరిపించడం

వెబ్సైట్ ద్వారా మెంబర్ గా చేరి సమర్థిస్తూ బహుజన రాజ్యాధికార ఏర్పాటులో భాగస్వాములు కావాలని కోరుతున్నాం
https://membership.spendback.in/
ఈ ఆశయాలు సాధించడానికి 10 లక్షల సభ్యత్వంతో కొత్త పొలిటికల్ పార్టీ పెడుతున్నాం
రూ.10/- తో సభ్యులుగా చేరి మద్దతు ఇవ్వండి
బహుజన రాజ్యాధికారం కోరుకునే ప్రతి ఒక్కరికి ఆహ్వానం
డా. కటికల శివ భాగ్యరావు బహుజన్, IRS-vrs
నేషనల్ చైర్మన్
Contact No. 7660027683 ,9160722537

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2/29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989